# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

27.2.2026 శుక్రవారం Friday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 222 | పేజీలు : 11 Pages : 11 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



## రిపోర్టర్లు కావలెను



జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789




## భూభారతి పేరుతో కాంగ్రెస్ మార్క్ అవినీతి

రెవెన్యూ వ్యవస్థను భ్రష్టుపట్టించిన కాంగ్రెస్ సర్కార్

మాజీ మంత్రి హరీష్ రావు విమర్శ

3

# ఇందిరమ్మ రాజ్యమంటే ఇండ్లు కూల్చడమేనా?



- పట్టాలు, పన్ను రశీదులు ఉన్నా దౌర్జన్యమా?
- బాధితులకు అండగా సుప్రీంకోర్టు దాకైనా వెళ్తాం
- కూల్చిన చోటే ఇళ్లు కట్టించి గృహప్రవేశం చేయిస్తాం
- ఖమ్మం బాధితుల పక్షాన కేటీఆర్ గర్జన

వివరాలు 3లో..



## ఇళ్లు కూలగొట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమే

- ఆధారాలు చూపిన మంత్రి పొంగులేటి
- కేటీఆర్‌కు మంత్రుల స్ట్రాంగ్ కౌంటర్

2

అర్హులైన ప్రతి పేదవాడికి ఇంటి స్థలం, ఇల్లు కచ్చితంగా ఇస్తామని భరోసా

## భారత్-ఇజ్రాయెల్ సరికొత్త మైత్రి



### త్వరలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

- యూపీఐ విషయంలో ఇరు దేశాల మధ్య ఎంవోయూ
- ఏఐ, వ్యవసాయ రంగాల్లో 27 కీలక ఒప్పందాలు
- ఇజ్రాయిల్ పర్యటనలో ప్రధాని ప్రకటన
- భారత్‌కు రుణపడి ఉన్నానన్న నెతన్యాహు

4

ఇజ్రాయెల్-భారత్ మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరనుందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. అలాగే ఇజ్రాయెల్‌లో కూడా త్వరలో యూపీఐ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. యూపీఐ పేమెంట్స్‌తో పాటు ఏఐ, వ్యవసాయం తదితర రంగాల్లో ఒప్పందాలు కుదిరాయి. రెండు దేశాల మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరగనున్నట్టు ఇరు దేశాల ప్రధానులు సంయుక్త ప్రకటనలో వెల్లడించారు.



## ఎన్‌సీఈఆర్‌టీ వివాదంపై మోదీ అసంతృప్తి

4



## భారతీయ విద్యాభవన్ తరహాలో

# సర్కారు స్కూళ్లు

### ప్రైవేట్ స్కూళ్ల ఫీజులకు కళ్లెం వేసేలా చర్యలు

- మౌలిక వసతులతో పాటు..బ్రేక్‌ఫాస్ట్
- విజయ డెయిరీ ద్వారా పాల సరఫరా
- రవాణా కోసం ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం
- సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** కోర్ అర్బన్ రీజియన్‌లో ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక సదుపాయాల కల్పనపైన దృష్టి సారించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూళ్లల్లో ఉన్న మౌలిక సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉండాలని సూచించారు. గురువారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌పైన సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు

మిగతా 2 లో





## జర్నలిస్టులకు ఊరట

అక్రిడిటేషన్ కార్డుల గడువు ఏప్రిల్ 30 వరకు పొడిగింపు

జీఓ 252, 103లపై హైకోర్టులో విచారణ.. ప్రభుత్వ వివరణకు ఆదేశం

2



02

- ఆకలినైనా సహిస్తారు కానీ ఆధిపత్యాన్ని కాదు..
- తెలంగాణ ప్రజల మనస్తత్వాన్ని గుర్తించాలి

## ప్రభుత్వ పథకాల అమలు బాధ్యత మీదే

గ్రూప్-1, 2 అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం





## భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

- మొత్తం 45మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు

2





## బ్యాంకింగ్ యాప్స్‌లో 'డార్క్ ప్యాటర్న్స్'కు చెక్

### ఆర్‌బీఐ సంచలన నిర్ణయం!

బ్యాంకింగ్ యాప్‌లు, వెబ్‌సైట్లలో వినియోగదారులను గందరగోళానికి గురిచేస్తూ, వారి ప్రమేయం లేకుండా అదనపు సేవలను రుద్దే 'డార్క్ ప్యాటర్న్స్' పద్ధతులపై ఆర్‌బీఐ ఉక్కుపాదం మోపింది.

4

## కుమ్మెర ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్

- పోలీసుల నిర్లక్ష్యంపై ఆగ్రహం
- నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం
- కలెక్టర్, ఎస్పీలకు నోటీసులు
- బాధితులకు న్యాయం చేయాలని స్పష్టీకరణ

2






# జర్నలిస్టులకు ఊరట

**అక్రిడిటేషన్ కార్డుల గడువు ఏప్రిల్ 30 వరకు పొడిగింపు**

**జీఓ 252, 103లపై హైకోర్టులో విచారణ.. ప్రభుత్వ వివరణకు ఆదేశం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల చెల్లుబాటుపై తెలంగాణ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న కార్డుల గడువును 2026 ఏప్రిల్ 30 వరకు పొడిగిస్తూ గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అక్రిడిటేషన్ నిబంధనలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీఓ 252 మరియు సవరించిన జీఓ 103లను సవాలు చేస్తూ తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీయూడబ్ల్యూజేఎఫ్) దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు ఈ విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపిస్తూ.. కొత్త జీఓల వల్ల జర్నలిస్టుల వృత్తిపరమైన కార్యకలాపాలకు, వారికి అందాల్సిన సదుపాయాలకు ఆటంకం కలుగుతోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ప్రభుత్వం తరపున స్పెషల్ అడ్వకేట్ జనరల్ స్పందిస్తూ.. జర్నలిస్టులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు కార్డుల గడువును మరో రెండు నెలల పాటు (ఏప్రిల్ 30 వరకు) పొడిగిస్తున్నట్లు కోర్టుకు వివరించారు. ఈ వివరణను రికార్డులోకి తీసుకున్న ధర్మాసనం, ఏప్రిల్ నెలాఖరు వరకు పాత కార్డులే చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేసింది. అక్రిడిటేషన్ నిబంధనల మార్పుపై ఫెడరేషన్ లేవనెత్తిన అభ్యంతరాలపై పూర్తి స్థాయి వివరణ సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను నాలుగు వారాల పాటు వాయిదా వేసింది.

# కుమ్మెర ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్

**పోలీసుల నిర్లక్ష్యంపై ఆగ్రహం**

**నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం**

**కలెక్టర్, ఎస్పీలకు నోటీసులు**


**బాధితులకు న్యాయం చేయాలని స్పష్టీకరణ**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** నాగర్‌కర్నూల్‌లో జరిగిన కుల వివక్ష దాడి , పోలీసుల నిర్లక్ష్యంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయ్యింది. ఘటనపై నాలుగు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. న్యాయవాది వినోద్ హిందుస్థానీ దాఖలు చేసిన ఫిర్యాదుపై స్పందిం చిన కమిషన్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్, ఎస్పీకి నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై తీసుకున్న చర్యల నివేదికను నాలుగు వారాల్లోగా సమర్పించాలని ఆదేశించింది. ఈనెల 18న కుమ్మెర మల్లన్న స్వామి జాతర సందర్భంగా చిలుకేశ్వరం చంద్రకళ కుటుంబాన్ని ఆలయంలోకి ప్రవేశాన్ని నిరాకరించడంతో పాటు రెండు నెలల పసికందును ఉద్దేశపూర్వకంగా తొక్కడంతో ఆ శిశువు మరణించింది. నిందితులపై చర్యలు తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులు నిర్లక్ష్యం వహించడాన్ని తప్పుపడుతూ న్యాయవాది కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితులు నాగర్‌కర్నూల్ పోలీసు స్టేషన్‌కు వెళ్లినప్పుడు, నిందితులకు ఉన్న రాజకీయ పలుకుబడి కారణంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి అధికారులు నిరాకరించారని ఆరోపించారు. పోలీసులు రాజ్యాంగ రక్షణలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను సైతం ఉల్లంఘించారని కమిషన్ గుర్తించిందన్నారు. నిందితులను అరెస్టు చేయడం, విధి నిర్వహణలో విఫలమైన పోలీసు అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, బాధితులకు రక్షణతో పాటు పరిహారం అందించాలని కమిషన్ పేర్కొందని వివరించారు.. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు న్యాయం జరిగే ప్రక్రియలో రాజకీయ పలుకుబడి అడ్డంకి కాకూడదని నిర్ధారించడానికి కమిషన్ జోక్యం ఒక కీలక ముందడుగు అన్ని వినోద్ హిందుస్థానీ పేర్కొన్నారు

# ఇంటర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్

**పట్టుబడ్డ నలుగురు విద్యార్థులు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** రాష్ట్రంలో బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షల రెండో రోజు గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్ మీడియట్ బోర్డు సెక్రటరీ తెలిపారు. మొత్తం 4,63,354 మంది విద్యార్థులకు గాను 4,52,980 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని వివరించారు. 10,374 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. వరంగల్‌లో 3, రంగారెడ్డి జిల్లాలో ఒకరు మాల్ ప్రాక్టీసు కు పాల్పడుతూ అధికారులకు పట్టుబడ్డారని పేర్కొన్నారు. వనపర్తి, వికారాబాద్, భద్రాద్రి, ఆదిలాబాద్, మంచిర్యాల, వరంగల్, సిద్దిపేట, మెదక్, కరీంనగర్, ములుగు, పెద్దపల్లి పరీక్షా కేంద్రాల పర్యవేక్షణకు పరిశీలకులను నియమించినట్లు తెలిపారు.

# భారతీయ విద్యాభవన్ తరహాలో స్కూళ్లు

మొదటి పేజీ తరువాయి

కే కేశవరావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి , విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉస్మాని యా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్, అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి హాజరయ్యా రు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని మార్గనిర్దేశం చేశారు. బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌లో తప్పనిసరిగా పాలు అందజేయాలని నిర్దేశిరచారు. ఇందుకోసం విజయా డైరీ నుంచి పాలు సేకరించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత కోసం ఏఐ టెక్నాలజీని వినియోగించాలని దిశానిర్దేశర చేశారు. కోర్ అర్బన్ రీజియన్ మినహా మిగిలిన నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కొక మండలంలో



ఆరుట్ల స్కూల్ తరహాలో ట్రాన్స్‌పోర్ట్‌తో సహా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ట్రాన్స్‌పోర్ట్ కోసం ఎలక్ట్రికల్ బస్సుల ఏర్పాటు పైన అధ్యాయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రైవేట్ స్కూల్స్‌లో నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దుతో పాటు రికవరీ చేసేలా నిబంధన విధించాలని హుకుం జారీ చేశారు. ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణకు సంబంధించి రికమండేషన్స్‌ని ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# ప్రభుత్వ పథకాల అమలు బాధ్యత మీదే


- ఆకలినైనా సహిస్తారు కానీ ఆధిపత్యాన్ని కాదు..
- తెలంగాణ ప్రజల మనస్తత్వాన్ని గుర్తుంచుకోవాలి
- గ్రూప్-1, 2 అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం



**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** తెలంగాణ ప్రజలు ఆకలినైనా సహిస్తారు కానీ, ఆధిపత్యాన్ని సహించబోరని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి గ్రూప్ 1 పరీక్షలను నిర్వహించి.. నియామక పత్రాలు అందించామన్నారు. గ్రూప్ 1, 2 ఉద్యోగుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాలను అమ్ముకున్నామని కోర్టుల్లో లీగల్ లిటిగేషన్ పెట్టారని, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క తప్పు కూడా చేయలేదని అన్నారు. బాగా చదువుకున్న వాళ్లను టీజీపీఎస్సీలో నియమించాం. అన్ని జాగ్రత్తలతో పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించాం. మీరంతా శిక్షణ పూర్తి చేసుకొని ఉద్యోగాల్లో చేరుతున్నారు. ప్రభుత్వం మిమ్మల్నే రాష్ట్ర ప్రతినిధులుగా భావిస్తోంది. మీ ద్వారానే ప్రభుత్వ పథకాలు అమలవుతాయి. మేం ఎన్ని పాలసీలు చేసినా.. దాని అమల్లో మీరే చాలా ముఖ్యం. బాధ్యతాయుతమైన పదవుల్లో చేరుతున్నారు. ఉద్యోగవిరమణ రోజు వరకు ఇదే స్ఫూర్తితో పని చేయాలి‘ అని దిశానిర్దేశర చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులతోపాటు శిక్షణ పూర్తి చేసుకున్న 271 మంది గ్రూప్-1, 171 మంది గ్రూప్-2 అధికారులు, 51 మంది మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# పేదలే ఇందిరమ్మ ప్రభుత్వ పేటెంట్

- వెలుగుమట్లలో ఇళ్లు కూలగొట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- ఆధారాలు చూపిన మంత్రి పొంగులేటి
- కేటీఆర్‌కు మంత్రుల స్ట్రాంగ్ కౌంటర్




**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతలపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలను రాష్ట్ర మంత్రులు తీవ్రంగా ఖండించారు. "పేదలే ఇందిరమ్మ ప్రభుత్వ పేటెంట్" అని, బాధితులకు ఇళ్ల స్థలాలు మరియు ఇళ్లు ఇచ్చే పూర్తి బాధ్యత తమ ప్రభుత్వానిదేనని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. 2023 జూలై 15న వెలుగుమట్లలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వమే పేదల ఇళ్లను కూలగొట్టించిందని, ఆ సంఘటనకు సంబంధించిన ఫోటోలను ప్రదర్శిస్తూ నిలదీశారు. అప్పట్లో ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చి గాలికి వదిలేసిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు హైకోర్టు ఉత్తర్వుల మేరకు జరిగిన అక్రమ నిర్మాణాల తొలగింపుపై మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల ప్రకారం అర్హులైన ప్రతి పేదవాడికి ఇంటి స్థలం, ఇల్లు కచ్చితంగా ఇస్తామని ఆయన భరోసా ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లక్షల కోట్ల అవినీతిపై కూడా మంత్రులు నిప్పులు చెరిగారు. కమీషన్ల కోసమే ప్రాజెక్టును తప్పుగా నిర్మించి రాష్ట్ర సంపదను సముద్రం పాలు చేశారని, కాళేశ్వరం అవినీతి సొమ్ముతోనే బీఆర్ఎస్ దేశంలోనే అత్యంత ధనిక ప్రాంతీయ పార్టీగా మారిందని విమర్శించారు. కేసీఆర్ తన పాలనలో దోచుకున్న సొమ్ముతో పేదలకు ఇళ్లు కట్టించి పాప పరిహారం చేసుకోవాలని ఎద్దేవా చేశారు. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఇచ్చినా కేంద్రం స్పందించకపోవడాన్ని బట్టి చూస్తే బీజేపీ-బీఆర్ఎస్ మధ్య ఉన్న రహస్య ఒప్పందం అర్థమవుతోందని ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరై, నిర్మాణాత్మకమైన సలహాలు ఇవ్వాలని, గత ప్రభుత్వంలాగా తాము గొంతు నొక్కబోమని, ప్రతిపక్షానికి మాట్లాడే పూర్తి అవకాశం ఇస్తామని మంత్రులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

- మొత్తం 45మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు
- పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం




**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. మొత్తం 45 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఒకేసారి 45 మంది ఐఏఎస్ అధికారులకు బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో కలెక్టర్ల స్థాయిలో పెద్దఎత్తున మార్పులు చోటుచేసుకున్నాయి. పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం జరిగింది. మహబూబాబాద్, మెదక్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు. టీఎస్‌జీపీడీసీఎల్‌కు కొత్త సీఎండీ నియామకం జరిగింది. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులయ్యారు. బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శిగానూ ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌కుమార్, విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌ను నియమించారు. ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్, దేవాదాయశాఖ కమిషనర్‌గా ఎం.హనుమంతరావు, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా డి.దివ్యను ప్రభుత్వం నియమించింది. వీరితో పాటు పలు జిల్లా కలెక్టర్లనూ ప్రభుత్వం బదిలీ చేసింది. యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా అనురాగ్ జయంతిని నియమించింది.పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సంజయ్ కుమార్‌ను నియమించారు. విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా దాన కిషోర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా శ్రీధర్‌ను నియమించారు. ఎండోమెంట్స్ కమిషనర్‌గా హనుమంతరావుకు కొత్త బాధ్యతలు అప్పగించారు. ఫైనాన్స్ శాఖ సెక్రటరీగా గౌరవ్ ఉప్పల్‌ను నియమించారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్.శ్రీధర్‌కు బాధ్యతలు అప్పగించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా చిత్రా మిశ్రాను నియమించారు. విజయేంద్ర - మహబూబ్‌నగర్ కలెక్టర్ పదవి నుంచి సోషల్ వెల్ఫేర్ శాఖ కార్యదర్శిగా నియామకం అయ్యారు. అద్వైత్ కుమార్ సింగ్ - మహబూబాబాద్ నుంచి ఢిల్లీ తెలంగాణ భవన్ సమన్వయ శాఖకు బదిలీ అయ్యారు. సిక్తా పట్నాయక్ - నారాయణపేట్ నుంచి ఆర్థిక శాఖకు ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ అయ్యారు. సందీప్ కుమార్ ఝా - జనగాం కలెక్టర్‌గా నియామకం అయ్యారు. ముష్రఫ్ అలీ ఫారూఖీ - టీఎస్‌జీపీడీసీఎల్ సీఎండీగా నియామకం అయ్యారు. జితేష్ వి.పాటిల్ - టీఎస్‌జీపీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. స్నేహ శబరీష్ - మహబూబాబాద్ కలెక్టర్‌గా నియామకం అయ్యారు. గరిమా అగర్వాల్- రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా నియామకం జరిగింది. ప్రతిమ సింగ్ - మెదక్ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. అనికేత్ - భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా ,చాహత్ బజ్పాయి - హనుమకొండ కలెక్టర్‌గా,ఖుష్బూ గుప్తా - మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా , పమేలా సత్పతి - లేబర్ కమిషనర్‌గా, అనురాగ్ జయంతి - యాదాద్రి కలెక్టర్‌గా ,ప్రదీప్ జైన్ - నారాయణపేట్ కలెక్టర్‌గా నియామకం జరిగింది.

TGTEL/25/A1737 | NETI SAKSHI

# ఇందిరమ్మ రాజ్యమంటే ఇండ్లు కూల్చడమేనా?



- పట్టాలు, పన్ను రశీదులు ఉన్నా దౌర్జన్యమా?
- బాధితులకు అండగా సుప్రీంకోర్టుకైనా..
- కూల్చిన చోటే గృహప్రవేశం చేయిస్తాం
- ఖమ్మం బాధితుల పక్షాన కేటీఆర్ గర్జన

**ఖమ్మం, ఫిబ్రవరి 26:** తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం రాజ్యమేలుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో తొలగించిన ఆక్రమణలను కేటీఆర్ పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. వచ్చే నెల16వ తేదీ నుంచి అసెంబ్లీ ప్రారంభ మవుతుందని ఖమ్మం ప్రజల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తామని అన్నారు. మీ అందరికీ న్యాయం జరిగేవరకూ మీ పక్షాన ప్రభుత్వంపై పోరాడతామని చెప్పుకొచ్చారు. తాము అధికారంలోకి రాగానే మీ అందరికీ ఇదే స్థలంలో ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని కేటీఆర్ భరోసా కల్పించారు. అందరూ ధైర్యంగా ఉండాలని అంటూ బాధితులకు కేటీఆర్ మాటిచ్చారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వరకు ఎక్కడ చూసినా కూల్చివేతలేనని ఆరోపించారు. ఖమ్మంలో కూల్చివేసిన కాలనీ చూశానని.. ముగ్గురు మంత్రులకు 60 ఎకరాల మీద కన్నుబడిందని ఆక్షేపించారు. ముగ్గురు మంత్రులు కలిసికట్టుగా ఈ దుర్మార్గం చేశారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎవరికీ తాము అన్యాయం చేయలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. అందరూ ధైర్యంగా ఉండాలని.. మీ అందరికీ అదే ప్రాంతంలో అక్కడే ఇళ్ల స్థలాలు ఇల్లు ఇస్తామని మాటిచ్చారు. ఇక్కడి వారందరికీ అండగా నిలబడాలని తాను వచ్చానని చెప్పుకొచ్చారు. ఇళ్ల కూల్చివేతపై కోర్టుకి కూడా వెళ్దామని.. మీకెవరికీ ఒక రూపాయి ఖర్చు లేకుండా మీ తరఫున తమ లీగల్ టీం పోరాడుతుందని మాజీమంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పేదలు ఎంతో కష్టపడి కట్టుకున్నఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్లతో కూల్చివేస్తున్న సంగతి తెలిసిందే. రేవంత్ సర్కార్ కనికరం లేకుండా ఖమ్మం అర్బన్ వెలుగుమట్ల భూదాన్ భూముల్లో పేదల ఇళ్లను నేలమట్టం చేస్తోంది. ఈ క్రమంలో వారికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులను కలిశారు. ఇళ్లు కోల్పోయిన వెలుగు మట్ట బాధితులను కేటీఆర్, పార్టీ నేతలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మిమ్మల్ని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుస్తరు. మీకు అది చేస్తం.. ఇది చేస్తం.. అది చేస్తమని.. మీ 900 కుటుంబాల్లో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తాడు. మీరు ఐక్యంగా ఉంటేనే విజయం సాధిస్తరు.. లేదంటే వీళ్లు ఏం చేస్తరు. ఏ 100 మందితో వేలి ముద్రలు తీసుకొని మీకు అన్నేన్నో ఇస్తరు.. కేసీఆర్ 2000 డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టించారు. వాటిలో కొన్ని మిగులున్నయట. ఆ ఇండ్లలో కొంతమందికిస్తమని చెప్పి వారిని లాక్కెళతారని కేటీఆర్ హెచ్చరించారు. ఓపీడీఆర్ వాళ్లు గతంలో ఎప్పుడో చేసిన పని. పాపం వాళ్లేం తప్పు చేయలేదు.. మీకు పట్టాలిప్పించారు. వాళ్లు తప్పు చేసిందేమి లేదు.. ఇప్పుడు వాళ్లను పట్టుకుని ప్రభుత్వం నానా మాటలు అంటోంది. ల్యాండ్ మాఫియానట.. ఎవడమ్మా ల్యాండ్ మాఫియా.. ఎవడైతే ఇవాళ మీ చుట్టూ వందల ఎకరాలు కొన్నాడో.. ఎవడైతే పేదవాడి ఇల్లు కట్టుకున్నడో వాడు మాఫియానా..? మీకు జరిగిన కష్టం.. మీ ఏడుపులు రాష్ట్రం మొత్తం చూసింది. మీ పిల్లలు, మీరు పడుతున్న అవస్థలు చూసే కేసీఆర్ సార్ మమ్మల్ని పంపించారు. దయచేసి ధైర్యంగా ఉండండి.. మీకు అన్ని రకాలుగా అండగా అజయ్ అన్న, మా ఎంపీ గాయత్రి రవిచంద్ర ఉంటారన్నారు. ఏ తప్పు జరుగకపోతే ఆర్డీవోను ఎందుకు వెంటనే బదిలీ చేశారు. సమాధానం చెప్పాలే ప్రభుత్వం. మంత్రులు తప్పు చేయకపోతే.. నిజంగా ధైర్యముంటే వాళ్లెందుకు రావడం లేదు.. ఇక్కడికి.. వాళ్లొచ్చి మాట్లాడాలి కదా.. అందుకే మీరు ధైర్యంగా ఉండండి. మీ వెంబడి కేసీఆర్ అన్న ఉన్నడు.. కేటీఆర్ అన్న ఉన్నడు. మేమంతా ఉన్నం. ఎట్టి పరిస్థితుల్లో మీకు న్యాయం జరిగేదాకా మేము అండగా ఉంటామని హామీనిచ్చారు. మీకు అన్ని కాగితాలున్నాయి.. కోర్టుకు పోదాం.. కోర్టుకు కూడా మీరు రూపాయి ఖర్చు పెట్టుకునే పని లేదు. పార్టీ తరఫున మేం కొట్లాడుతాం.. మీకు మేం అండగా ఉంటాం. మళ్లీ వస్తాం మిమ్మల్ని కాపాడుకుంటాం. న్యాయపరంగా పట్టాలిప్పించే ప్రయత్నం చేస్తాం. దయచేసి ఐకమత్యాన్ని కోల్పోకండి.. సంఘటితంగా, ఒక్కటిగా ఉండండిని సూచించారు.





# భూభారతి పేరుతో కాంగ్రెస్ మార్క్ అవినీతి

- రెవెన్యూ వ్యవస్థను భ్రష్టుపట్టించిన కాంగ్రెస్ సర్కార్
- మాజీ మంత్రి హరీష్ రావు విమర్శ
- సిద్దిపేట అర్బన్ ఎమ్మార్వో కార్యాలయం సందర్శన



**సిద్దిపేట, ఫిబ్రవరి 26:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని, ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని చెప్పిన నాయకులు.. ఇప్పుడు 'భూభారతి' పేరుతో ప్రజలను గోసపెడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శించారు. గురువారం సిద్దిపేట అర్బన్ ఎమ్మార్వో కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆయన, అక్కడ పడిగాపులు కాస్తున్న ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వారం రోజుల్లోనే ఇంటికి వచ్చే పాస్ పుస్తకాలు, ఇప్పుడు ఆరు నెలలైనా రావడం లేదని హరీష్ రావు మండిపడ్డారు. రెవెన్యూ సదస్సుల పేరిట రైతులు పెట్టుకున్న 8.68 లక్షల దరఖాస్తులను ప్రభుత్వం పక్కన పడేసిందని, సాదా బైనామా భూముల విషయంలో 'అమ్మిన వ్యక్తి అఫిడవిట్ ఇవ్వాలి' అనే కొత్త నిబంధన తెచ్చి లక్షలాది మంది రైతుల నోట్లో మట్టికొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిషేధిత భూముల జాబితాను ఆన్‌లైన్‌లో పెట్టకుండా కోటి ఎకరాలకు పెంచేసి కాంగ్రెస్ నేతలు పక్కాగా రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారని ఆరోపించారు. హైకోర్టు మొట్టికాయలు వేస్తున్నా ప్రభుత్వ తీరు మారడం లేదని ధ్వజమెత్తారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేస్తామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ప్రజల ముక్కుపిండి వసూలు చేస్తోందని ఆయన విమర్శించారు. రెవెన్యూ శాఖలో అవినీతి పరాకాష్టకు చేరిందని, సాక్షాత్తు మంత్రి కుమారుడే భూకబ్జాలకు పాల్పడుతుంటే ప్రశ్నించిన సీఐని బదిలీ చేయడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని దుయ్యబట్టారు. చనిపోయిన వీఆర్ఓల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని, 4 వేల మంది వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రెవెన్యూ సమస్యలను పరిష్కరించకుంటే రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రజల పక్షాన గట్టిగా పోరాడుతామని హరీష్ రావు హెచ్చరించారు.

# మార్చి 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా '100 రోజుల ప్రణాళిక'



**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** సీఎం ఆదేశాల మేరకు రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం '100 రోజుల కార్యాచరణ ప్రణాళిక'ను సిద్ధం చేసింది. సచివాలయంలో గురువారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో సీఎస్ రామకృష్ణారావు అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులతో కలిసి ఈ ప్రణాళికపై చర్చించారు. మార్చి 2 నుంచి జూన్ 9 వరకు (తెలంగాణ ఆవిర్భావ వేడుకల వరకు) ఈ 100 రోజుల ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఈ వంద రోజుల ప్రణాళికపై ఈ నెల 28న ముఖ్యమంత్రి స్వయంగా కార్యదర్శులతో సమావేశమై దిశానిర్దేశం చేయనున్నారు. అనంతరం మార్చి 1న (ఆదివారం) రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లందరితో సీఎం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహిస్తారు. ఈ సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై తక్షణమే నివేదికలు రూపొందించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ తమ పరిధిలోని అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న భవనాల వివరాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఈ 100 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, విద్య, వైద్యం, వ్యవసాయం, పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్యుత్ వంటి అన్ని కీలక శాఖలు ఈ 100 రోజుల కార్యాచరణలో భాగం పంచుకోనున్నాయి. ముఖ్యంగా నూతనంగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లకు పారిశుధ్యం, గ్రామీణాభివృద్ధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సీఎస్ స్పష్టం చేశారు. అలాగే పాలనలో పారదర్శకత కోసం సచివాలయంతో పాటు అన్ని హెచ్ఓడీ కార్యాలయాల్లో 'ఈ-ఆఫీస్' విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేస్తూ, ఫిర్యాదుల పరిష్కారానికి ఈ 100 రోజుల కార్యక్రమం ఒక వేదికగా నిలవనుంది.



# వీహెచ్, జెట్టిలకు రాజ్యసభ ఇవ్వాలి

## ఆ ఇద్దరి సభ్యత్వాలపై ఆలోచన చేయాలని

## ఖర్గేను కలిసి కోరిన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల్లో కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్‌లకి ఇవ్వాలని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గురువారం ఢిల్లీలో కలిశారు. ఖర్గేతో ఆయన పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణలో ఖాళీ కానున్న రెండు రాజ్యసభ స్థానాలపై సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కూడా ఈ విషయంపై మాట్లాడానని, వి. హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్‌లకి రాజ్యసభ ఇవ్వాలని కోరానని అన్నారు. ఇదే విషయంపై రాహుల్ గాంధీని, మల్లికార్జున్ ఖర్గేని కలవడానికి ఢిల్లీకి వచ్చానని తెలిపారు. రాహుల్ గాంధీ ముందస్తు షెడ్యూల్ కారణంగా ఆయన బిజీగా ఉన్నారని చెప్పుకొచ్చారు. వి. హనుమంతరావు. జెట్టి కుసుమ కుమార్‌లకు రాజ్యసభ అవకాశాలపై ఆలోచన చేయాలని కోరానని తెలిపారు. జెట్టి కుసుమ కుమార్.. యూత్ కాంగ్రెస్ లీడర్‌గా, స్టూడెంట్ లీడర్‌గా.. కమ్మ సామాజిక వర్గం నుంచి ఉన్నారని ప్రస్తావించారు. జెట్టి కుసుమ కుమార్ ఫ్యామిలీ ఫ్రీడమ్ ఫైటెర్స్ అని, వాళ్ల కుటుంబం నుంచి అంతా కాంగ్రెస్‌లోనే ఉన్నారని గుర్తుచేశారు. హనుమంతరావు తెలంగాణలో అనేక మంది ముఖ్యమంత్రులతో పని చేశారని వెల్లడించారు. మూడుసార్లు రాజ్యసభ ఎంపీగా పని చేశారని చెప్పుకొచ్చారు. ఆయనకు రాజీవ్ గాంధీ , సోనియాగాంధీ అవకాశాలు ఇచ్చారని తెలిపారు. వి.హనుమంతరావు చురుకైన వ్యక్తి అని, ఆయనకు మరోసారి రాజ్యసభకు అవకాశం ఇవ్వాలని ఖర్గేను కోరానని అన్నారు. కమిటీలో చర్చిస్తామని ఖర్గే హామీ ఇచ్చారని తెలిపారు. రాహుల్ గాంధీ నిర్ణయం మేరకు ముందుకు వెళ్తామని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# చిన్నారి మృతి కారకులను శిక్షించాలి

## లేదంటే హైదరాబాద్‌ను దిగ్బంధిస్తాం

## మాజీమంత్రి తలసాని హెచ్చరిక



**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 26 :** కుమ్మెర మల్లన్న జాతరలో రెండు నెలల చిన్నారి మృతికి కారణమైన వారిని శిక్షించాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం నాగర్ కర్నూల్ కేంద్రంలో కుమ్మెర బాధితుల పక్షాన చేపట్టిన దీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజులలో దోషులపై చర్యలు తీసుకోకుంటే హైదరాబాద్‌ను దిగ్బంధం చేస్తామని , అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అభం శుభం తెలియని చిన్నారి మృతికి కారకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు అవుతున్న బడుగు బలహీన వర్గాల ప్రజల పట్ల కొనసాగుతున్న వివక్ష, దాడులు, దౌర్జన్యాలు, ఆలయాల్లో ప్రవేశంపై ఆంక్షలు కొనసాగడం బాధాకరమని అన్నారు.దేవుడిని దర్శించుకునే అర్హత బలహీన వర్గాలకు లేదా? అని ప్రశ్నించారు. కుమ్మెర దోషులను రక్షించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

# గిరిజన కళపై ఐదు రోజుల శిక్షణ




**హైదరాబాద్,ఫిబ్రవరి26:** గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్ సూచనల మేరకు గిరిజన సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా వినూత్నంగా 20 మంది క్రాఫ్ట్ టీచర్స్ మరియు 10 మంది గిరిజన ఆర్టిజన్స్ మొత్తం 30 మందికి గిరిజన సంప్రదాయక కళల పైన ఫ్యాబ్రిక్ బ్లాక్ ప్రింటింగ్ అనే అంశంపై ఐదు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైదరాబాదులో 26 వ తేదీ నుండి 2 మార్చ్ వరకు నిర్వహిస్తున్నారు. శిక్షణలో పాల్గొన్న అభ్యర్థులు ఐటిడిఏ ఉట్నూర్, ఏటూనాగారం, భద్రాచలం, ప్లెయిన్ ఏరియా నుండి సంబంధిత ఐటిడిఏ అధికారుల ద్వారా నామినేట్ చేయబడి రావడం జరిగింది. వీరందరికీ భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నారు. అదేవిధంగా పదిమంది గిరిజన ఆర్టిజన్స్ కు ప్రతిరోజు వెయ్యి రూపాయల చొప్పున ఆనరోరియం కూడా ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో టిఆర్ఐ సంచాలకులు డాక్టర్ వి సముజ్వల , టి ఆర్ ఐ సంగ్రహాలయ సంరక్షకులు డాక్టర్ డి సత్యనారాయణ , శిక్షణనిస్తున్న డైరెక్టర్ డా. సునీతా ప్రసాద్ బృందం, ట్రైనింగ్ కోఆర్డినేటర్ శ్రీమతి అజ్మీరా శైలజ , టిఆర్ఐ సిబ్బంది పాల్గొన్నారు.



## సంపాదకీయం

# మమతా బెనర్జీ కళ్లు తెరవాలి!

**బెంగాల్లో సర్ ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో అక్కడ జ్యుడిషియల్ అధికారుల అజమాయిషీలో జరగాలని ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతోపాటే సర్ ప్రక్రియను అడ్డుకోరాదని మమతా బనర్జీకి సుప్రీం గట్టిగానే సూచించింది. నిజానికి సర్ ప్రక్రియ ద్వారా ఓట్లను సంస్కరించడం అవసరమే. తమిళనాట లక్షల్లో ఓట్లు తొలగించారు. గుజరాత్‌లోనూ తొలగించారు. ఇప్పుడు దక్షిణాదిలో కూడా సర్ ప్రక్రియ కొనసాగనుంది. ఈ క్రమంలో ఓట్లు తొలగింపు వల్ల ఎవరైనా తమ ఓటు నిజంగానే కోల్పోతే వారి పక్షాన ప్రభుత్వం పోరాడాలి. అంతే తప్ప అడ్డుకోవడం సరికాదు. ఇదేదో రాజ్యాంగ విఘాతం కలిగించారన్న రీతిలో ప్రచారం చేయడం విపక్షాలకు తగదు.**

ఎన్నికల కమిషన్ ఏం చేసినా, ఎలా చేసినా విమర్శించే విపక్ష స్థానంలో ఉన్న కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డిఎంకెపార్టీలు తీవ్రంగా అడ్డుపడు తున్నాయి. బ్యాలెట్ బాక్స్ లతో ఓటింగ్ విధానం ఎలక్ట్రానిక్ ఓటింగ్ పద్ధతికి మారాక కొన్ని ఎన్ని కల వరకూ బాగా నడిచిందని ప్రశంసలు ఇచ్చిన పార్టీలు ఇప్పుడు ఆ విధానం వల్ల తమకు నష్టం వాటిల్లుతోందని ఘోషిస్తున్నాయి. పార్టీ ఏదైనా తమకు ఓటింగ్ అనుకూలంగా రాకపోయి ఓటమిపాలైతే ఎలక్ట్రానిక్ ఓటింగ్ పక్రి యలో లోటుపాట్లు ఉన్నందునే తాము ఓడిపోయామని విమర్శలు గుప్పిస్తున్నారు. విపక్ష పార్టీలు తమ స్థానాలు మారినా విమర్శలకు వెనుకాడడం లేదు. 'సర్' పేరెత్తితేనే విపక్షాల్లో అదీ అతి ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ అపచారం జరిగిందని అంటున్నారు. ఇలా కాకుండా ఎక్కడైనా ఓట్ల తొలగింపుతో ఎవరైనా నష్టపోతే దానిని ఆధారంగా చేసుకుని పోరాడాలి. కానీ మొత్తం ప్రక్రియనే వ్యతిరేకించడం ద్వారా రాజ్యాంగాన్ని తృణీకరిస్తున్నాయని గుర్తించాలి. సుప్రీం ఇచ్చిన ఆదేశాలు లేదా సూచనలు ఆయా రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలి. ఇంకా సర్ ప్రక్రియను అప్రతిష్టపాలు చేయాలనే ఆలోచన నుంచి రాజకీయ పార్టీలు బయటపడాలి. ఎన్నికల కమిషన్ పై సవాల్ చేసిన కాంగ్రెస్ పార్టీ ఓట్ చోరీపై తమ నిరసన ధ్వనులను పెంచుతున్నాయి. ఒకపక్క ఎన్నికల కమిషన్ త్వరలో ఎన్నికలు జరిగే పశ్చిమబెంగాల్, తమిళ నాడు, కేరళ వంటి రాష్ట్రాలలో ఓటర్ల జాబితా విస్తృత సవరణ (సర్) కార్యక్రమాన్ని చేపట్టగా కాంగ్రెస్ అధ్యక్షు డు రాహుల్గాంధీ, 'ఓట్ చోరీ' ప్రచార కార్యక్రమాన్ని బహుళ ప్రచారం చేస్తున్నారు. బీహార్ ఎన్నికల్లో చతికిలపడినా ఓటరు జాబితా విషయంలో రాజీ పడేది లేదనే ధోరణిలో ముందుకు కదులుతున్నారు. బీహార్లో 'సర్' కార్యక్రమం చేపట్టినప్పుడు ఎన్నికల కమిషన్ను కాంగ్రెస్ పార్టీ విపరీ తంగా ఆరోపణలు గుప్పించింది. ఎన్నికల కమిషన్ తన ధోరణిలో తనప్రణాళిక ప్రకారం ఓటరు జాబితా సవరణ కార్యక్రమం చేపట్టింది. ఎన్నికలు సజావుగానే నడిపించింది. బీహార్లో అప్పటికే అధికారంలో ఉన్న పార్టీకే ప్రజలు పట్టం కట్టారు. అంటే విపక్షాల అభ్యంతరాలు ఎవరినీ కదిలించలేదన్నది సుస్పష్టం. అయినా కాంగ్రెస్ తదితర పక్షాలు తాము పట్టిన కుందేటికి మూడే కాళ్లన్న ధోరణిలో తమ పిడివాదంతో విమర్శలు గుప్పిస్తున్నాయి. ఓటు దొంగల కబంధ హస్తాల నుంచి భారత ప్రజాస్వామ్యాన్ని రక్షించే నినాదంతో కాంగ్రెస్ సంతకాల సేకరణ చేస్తోంది. బీహార్ ఫలితాల తర్వాత కాంగ్రెస్ పార్టీ తన ఆలోచనలో మార్పు తెచ్చుకోగలదని అందరూ భావించారు. కానీ అలా జరుగలేదు. కనీసం ఆది నుంచీ ఒకే మాటమీద వ్యవహా రాన్ని నడిపిస్తున్నారు. బోగస్ ఓట్లను చేర్చడం, విపక్ష అనుకూల ఓటర్లను తొలగించడం, ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడడం వంటివి ఎన్నికల కమిషన్ భారతీయ జనతా పార్టీలు కలిసికట్టుగా వ్యవహరిస్తున్నాయన్నది కాంగ్రెస్ ఆరోపణలు. బిజెపి ఓటర్లకు ఆయా నియోజక వర్గాల్లో నగదు పంచుతున్నా చర్యలు తీసుకోకుండా, ఇసి సహకరిస్తోందని విపక్షాలు గట్టిగా నమ్ముతున్నాయి. తాజాగా పశ్చిమ బెంగాల్లో ఓటర్ల జాబితా సవరణ మొదలైంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఎన్నికల కమిషన్పై రుసరుసలాడుతున్నారు. దేశవ్యాప్తంగా ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఒక ఉద్దేశపూర్వక కుట్రగా అభివర్ణించారు. బీహార్ లో 'సర్' అమలులో విజయవంతమైన కార్యక్రమంగా రూపొందించి దేశవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాన్ని చేప ట్టేందుకు ఇసి నిర్ణయం తీసుకుందంటే అది ఎంతోమంచి కార్యక్రమమేననుకోవాలి. అయినా బిజెపియేతర ఇండియా కూటమిలు ప్రధానపక్షమైన కాంగ్రెస్ఎన్నికల కమిషన్ వివవరణలను ఆకళింపు చేసుకోలేకపోయింది. దానికితోడు దేశవ్యాప్త 'సర్' విచారణ కోసం నియమితులైన 16మంది బిఎల్ఎలు ఒత్తిడి వల్లనే మరణించారన్న వార్తలను ఆసరాగా చేసుకుని ఇసి ఒత్తిడిలపై కాంగ్రెస్ ధ్వజమెత్తింది. పశ్చిమ బంగలోని ధులగోరి, బిరాటి, న్యూటేన్ ఘుసురి వంటి ప్రాంతాల్లో ఎక్కువగా ఉండే బంగ్లా దేశీయులు ఓటర్ల జాబితా ఏరివేతలో తగు పత్రాలు చూపలేక అక్రమంగా వలస వచ్చినట్లు తేలినవారంతా ఇప్పుడు బంగ్లాదేశ్ దారిపట్టారు. ఇప్పుడీ కార్యక్రమం వలన పశ్చిమ బెంగాల్లో సంక్లిష్ట పరిస్థితులేర్పడ్డా యి. బంగ్లాదేశ్ నుంచి వచ్చి బెంగాల్లో ఉండేవారి పత్రా లను చూసే పనిని బిఎస్ఎఫ్ జవాన్లకు అప్పగించారు. వెనక్కివెళ్లే సమయంలోనూ వీరే వారిపత్రాలను పరిశీ లించి పోలీసులకు పంపాల్సి ఉంటుంది. ఈ పక్రియ ఎంతో కష్టమైనది. సుదీర్ఘమైనది. బంగ్లాదేశీయుల రివర్స్ మైగ్రే షన్తో బెంగాల్ పోలీసులు సతమత మవుతున్నారు. సరైన పత్రాలు లేనివారిని నిర్బంధించి జైల్లోపెట్టే పరిస్థితి ఉంది. నిజానికి బంగ్లాదేశీయులు పశ్చిమ బెంగాల్లో ప్రవేశించిన ప్పుడు దళారీల ద్వారా ఆధార్ కార్డులు రేషన్ కార్డులు, ఓటరు ఐడీలతో ప్రవేశించారు. ఇప్పుడు అలాంటి ఎన్నీ బయటపడి పత్రాలన్నీ నకిలీవని తేలుతున్నందున మమతా బెనర్జీ సిగ్గుపడాలి.



# భారత్-ఇజ్రాయెల్ సరికొత్త మైత్రి

- త్వరలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం..
- యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఎంవోయూ
- ఏఐ, వ్యవసాయ రంగాల్లో 27 కీలక ఒప్పందాలు
- ఇజ్రాయిల్ పర్యటనలో ప్రధాని ప్రకటన
- భారత్‌కు రుణపడి ఉన్నానన్న నెతన్యాహు





**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** ఇజ్రాయెల్–భారత్ మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరనుందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. అలాగే ఇజ్రాయెల్‌లో కూడా త్వరలో యూపీఐ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. యూపీఐ పేమెంట్స్‌తో పాటు ఏఐ, వ్యవసాయం తదితర రంగాల్లో ఒప్పందాలు కుదిరా యి. రెండు దేశాల మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరగనున్నట్టు ఇరు దేశాల ప్రధానులు సంయు క్త ప్రకటనలో వెల్లడించారు. మొత్తం 27 రంగాల్లో పరస్ప ర సహకారానికి ఇరు దేశాలు అంగీకరించాయి. మరోవై పు గాజాపై ప్రధాని మోదీ మరోసారి భారత్ వైఖరిని స్పష్టం చేశారు. మానవత్వం ఎప్పుడూ సంఘర్షణకు బలికాకూడదన్నారు. ప్రస్తుతం శాంతి ప్రణాళిక ద్వారా ఓ ముందడుగు పడిందని, ఈ ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతుగా నిలుస్తుందని మోదీ హామీ ఇచ్చారు. ÷ూగా, త్వరలోనే భారత పర్యటనకు రావాల్సిందిగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహును ఆహ్వానించారు. అంతకు ముందు ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని నెతన్యాహు ప్రశంసించారు. ఆయన ప్రసంగం ప్రతి ఒక్కరినీ కదిలించిందని అన్నారు. భారత్ కు రుణపడి ఉన్నామన్నారు. మోదీ తమకు స్నేహితుడు కంటే ఎక్కువని అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పర్యటన రెండు దేశాల మధ్య సరికొత్త మైత్రికి నాంది పలికింది. విమానాశ్రయం నుంచి ఇజ్రాయెల్ పార్లమెంట్ వరకు మోడీకి లభించిన ఘన స్వాగతం ఈ పర్యటన ప్రాధాన్యతను చాటిచెప్పింది. పర్యటనలో భాగంగా నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తన వ్యక్తి గత విషయాన్ని ఒకటి పంచుకొని అందరినీ ఆశ్చర్యపరి చారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు మాట్లాడుతూ.. తన భార్యతో తన మొదటి డేట్ ఒక భారతీయ రెస్టారెంట్‌లో జరిగిందని, ఆ భోజనం అద్భుతంగా ఉండటం వల్లే వారి బంధం బలపడిందని సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి తాను, తన పిల్లలు కూడా భారత్‌కు రుణపడి ఉంటామని ఆయన అనగానే ప్రధాని మోడీ నవ్వు ఆపుకోలేక పోయారు. భారతదేశంలోని అపారమైన ప్రతిభను, ఇజ్రాయెల్‌లోని సాంకేతిక పరిజ్ఞానాన్ని కలపడం ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చని ఇద్దరు నేతలు ఆకాంక్షించారు. ప్రధానంగా కచ్చితమైన వ్యవసాయం, సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఆవిష్కరణలు, సాంకేతికత, అభివృద్ధికి సంబంధించి రెండు దేశాల మధ్య 16 కీలక అవగాహన ఒప్పందాలు జరిగాయి. రెండు దేశాల మధ్య స్నేహాన్ని మరింత బలోపేతం చేసేందుకు త్వరలోనే భారత్‌లో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నేతలు నిర్ణయించారు. 'మా వ్యక్తిగత స్నేహం, ప్రభుత్వాల మధ్య సహకారం, ప్రజల మధ్య అనుబంధం నానాటికీ బలపడుతోంది' అని నెతన్యాహు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. దీనిని కొనసాగించేందుకు సాధ్యమైనంత త్వరగా భారతదేశంలో ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పర్యటన కేవలం దౌత్యపరమైన ఒప్పందాలకు మాత్రమే పరిమితం కాకుండా, ఇద్దరు దేశాధినేతల మధ్య ఉన్న బలమైన వ్యక్తిగత స్నేహాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది.



# బ్యాంకింగ్ యాప్స్‌లో 'డార్క్ ప్యాటర్న్స్'కు చెక్

## ఆర్‌బీఐ సంచలన నిర్ణయం!

**ముంబై, ఫిబ్రవరి 26:** భారతదేశంలో డిజిటల్ బ్యాంకింగ్ వాడుతున్న కోట్లాది మంది వినియోగదారులకు ఊరటనిచ్చేలా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక మార్గదర్శకాలను విడుదల చేసింది. బ్యాంకింగ్ యాప్‌లు, వెబ్‌సైట్లలో వినియోగదారులను గందరగోళానికి గురిచేస్తూ, వారి ప్రమేయం లేకుండా అదనపు సేవలను రుద్దే 'డార్క్ ప్యాటర్న్స్' పద్ధతులపై ఆర్‌బీఐ ఉక్కుపాదం మోపింది. ఈ మేరకు 'రెస్పాన్సిబుల్ బిజినెస్ కండక్ట్ అమెండ్‌మెంట్ డైరెక్షన్ 2026' పేరుతో ముసాయిదా నిబంధనలను ప్రకటించిన ఆర్‌బీఐ, దేశంలోని అన్ని వాణిజ్య బ్యాంకులు తమ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఉన్న ఇటువంటి మోసపూరిత డిజైన్లను 2026 జూలై నాటికి పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. సాధారణంగా ఏదైనా ట్రాన్సాక్షన్ చేస్తున్నప్పుడు చివరి నిమిషంలో తెలియకుండానే అదనపు ఛార్జీలు పడటం, ఇన్సూరెన్స్ వంటి సేవలను కొనుగోలు చేయమని పదేపదే నోటిఫికేషన్లు రావడం వంటివి డార్క్ ప్యాటర్న్స్ కిందకు వస్తాయి. ఇవి వినియోగదారుల నిర్ణయాధికారాన్ని దెబ్బతీస్తూ వారిని తప్పుదారి పట్టించేలా ఉన్నాయని ఆర్‌బీఐ గుర్తించింది. కొత్త మార్గదర్శకాల ప్రకారం ఏదైనా ఆర్థిక ఉత్పత్తిని విక్రయించేటప్పుడు కస్టమర్ నుంచి స్పష్టమైన అనుమతి తీసుకోవాలని, కస్టమర్లు అడగని థర్డ్ పార్టీ ఉత్పత్తులను బలవంతంగా అంటగట్టకూడదని స్పష్టం చేసింది. బ్యాంకులు ఇచ్చే ప్రకటనలు వాస్తవాలకు దగ్గరగా ఉండాలని, వడ్డీ రేట్లు, ఇతర ఛార్జీల గురించి పూర్తి సమాచారాన్ని ముందే బహిర్గతం చేయాలని ఆదేశించింది. ఆర్‌బీఐ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల డిజిటల్ బ్యాంకింగ్ మరింత సురక్షితం కానుందని, వినియోగదారులకు తెలియకుండా జరిగే అనవసర ఖర్చులు తగ్గుతాయని నిపుణులు భావిస్తున్నారు.

# ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ

## వసలదారుల పట్ల అనుసరిస్తున్న విధానంపై కోర్టు ఆగ్రహం



**న్యూయార్క్, ఫిబ్రవరి 26:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఆ దేశ న్యాయస్థానాల్లో వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ప్రపంచ దేశాలపై సుంకాల విషయాల ఇప్పటికే కోర్టు నుంచి వ్యతిరేక తీర్పు రాగా.. తాజాగా వలసదారుల విషయంలోనూ అదే అనుభవం ఎదురైంది. అక్రమ వలసదారులను వారికి సంబంధం లేని ఇతర దేశాలకు తరలించడాన్ని అక్కడి ఫెడరల్ కోర్టు తప్పుబట్టింది. అక్రమ వలసదారుల విషయంలో ట్రంప్ కార్యవర్గం తీసుకున్న నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ మసాచుసెట్స్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి తీర్పునిచ్చారు. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ వలసదారులను టా÷–గ్గ్ం÷ట్ చేసిన సంగతి తెలిసిందే. అక్రమ వలసదారులను అమెరికా నుంచి గ్వాటమాల, దక్షిణ సూడాన్, కోస్టారికా వంటి ఇతర దేశాలకు తరలించారు. దీంతో ఈ తరలింపు ముప్పును ఎదుర్కొంటున్న వలసదారులు కోర్టులో దావా వేశారు. దావాపై తాజాగా న్యాయస్థానంలో విచారణ జరిగింది. సరైన భద్రతా చర్యలు తీసుకోకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, తగిన సమయం ఇవ్వకుండా వారికి సంబంధం లేని వేరే దేశాలకు తరలించడం చట్ట విరుద్ధమని కోర్టు తీర్పునిచ్చింది (÷బిlటlసజీ ఇనీబీసబి తిపపతిణసజీబితినీని ఇజీబl). ట్రంప్ కార్యవర్గం నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు ట్రంప్ యంత్రాంగానికి 15 రోజుల సమయం ఇచ్చింది.

# ఎన్‌సీఈఆర్‌టీ వివాదంపై మోదీ అసంతృప్తి



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** జాతీయ విద్యాపరిశోధన–శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) 8వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలో అవినీతి'ని పాఠ్యాంశంగా చేర్చటం దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ అసంతృప్తి వ్యక్తం చేశారట. ప్రభుత్వంలోని విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. 'వీటన్నింటినీ ఎవరు పర్యవేక్షిస్తున్నారు?.. బాధ్యులను గుర్తించారా? ' అని మోదీ ప్రశ్నించారట. ఇక, ఈ విషయంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విచారం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'మేము న్యాయ వ్యవస్థకు అత్యున్నత స్థానం ఇచ్చాం. న్యాయ వ్యవస్థను కించపరచాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి ఇసుమంత కూడా లేదు. మేము ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నాము. న్యాయ వ్యవస్థ తీసుకున్న నిర్ణయంతో ఏకీభవిస్తున్నాము. జరిగిన దానికి నేను ఎంతో చింతిస్తున్నా' అని అన్నారు.

# భారతీయ రైల్వేల్లో డిజిటల్ విప్లవం

- 'రైల్ టెక్' పోర్టల్, 'ఈ-ఆర్సీటీ' వ్యవస్థ ప్రారంభం
- 52 వారాల్లో 52 సంస్కరణలు
- స్టార్టప్‌లు, ఆవిష్కర్తలకు పెద్దపీట

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** భారతీయ రైల్వే రంగాన్ని సాంకేతికంగా మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ "52 వారాల్లో 52 సంస్కరణలు" అనే వినూత్న కార్యక్రమంలో భాగంగా పలు కీలక డిజిటల్ వేదికలను ప్రారంభించారు. ఇందులో భాగంగా రైల్వే రంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు 'రైల్ టెక్' పాలసీని ప్రకటించడంతో పాటు, దానికి సంబంధించిన ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. అలాగే రైల్వే క్లెయిమ్స్ ట్రైబ్యునల్ కార్యకలాపాలను సులభతరం చేసేందుకు 'ఈ–ఆర్సీటీ' డిజిటల్ వ్యవస్థను కూడా ఆయన ప్రారంభించారు.

### ఆవిష్కర్తలకు నేరుగా అవకాశం

కొత్తగా ప్రారంభించిన రైల్ టెక్ పోర్టల్ ద్వారా స్టార్టప్ కంపెనీలు, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, వ్యక్తిగత ఆవిష్కర్తలు తమ అత్యాధునిక సాంకేతిక ఆలోచనలను నేరుగా రైల్వే శాఖకు తెలియజేయవచ్చు. దీనివల్ల భారతీయ రైల్వేలో ఆధునిక సాంకేతికతను వ్యవస్థబద్ధంగా ప్రవేశపెట్టేందుకు వీలు కలుగుతుంది. దేశీయ పరిజ్ఞానంతో రైల్వే రంగాన్ని ఆధునీకరించాలనే లక్ష్యంతో ఈ పోర్టల్‌ను రూపొందించినట్లు మంత్రి తెలిపారు.

### క్లెయిమ్స్ పరిష్కారంలో వేగం

రైల్వే క్లెయిమ్స్ ట్రైబ్యునల్‌లో తీసుకువచ్చిన 'ఈ-ఆర్సీటీ' వ్యవస్థ ద్వారా బాధితులకు సత్వర న్యాయం అందనుంది. ప్రమాదాలు లేదా ఇతర ఘటనలకు సంబంధించి క్లెయిమ్‌లను ఇకపై 24 గంటల పాటు ఆన్‌లైన్‌లోనే (ఈ ఫైలింగ్) దాఖలు చేసుకోవచ్చు. రియల్ టైమ్ కేసు ట్రాకింగ్, పేపర్‌లెస్ కోర్టులు, హైబ్రిడ్ విచారణలు మరియు ఆన్‌లైన్ తీర్పులు వంటి సదుపాయాలు ఈ వ్యవస్థ ద్వారా అందుబాటులోకి వచ్చాయి. దీనివల్ల బాధితులు ట్రైబ్యునల్‌ను ప్రత్యక్షంగా సందర్శించాల్సిన అవసరం లేకుండానే తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చు. రాబోయే 12 నెలల్లో దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వే క్లెయిమ్స్ ట్రైబ్యునల్ బెంచ్‌లను పూర్తిగా డిజిటలైజ్ చేయనున్నట్లు మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ సందర్భంగా ప్రకటించారు.



# నర్సరీ ఏర్పాటుపై వివాదం

## కొండ్రోనిపల్లి, గోటూరు గ్రామస్తుల మధ్య వాగ్వివాదం

**నేటి సాక్షి నారాయణపేట:** నారాయణపేట జిల్లా ధన్వాడ మండల పరిధిలోని కొండ్రోనిపల్లి – గోటూరు గ్రామస్తుల మధ్య మొక్కల నర్సరీ ఏర్పాటు విషయంలో తీవ్రస్థాయిలో వివాదం నెలకొంది. అధికారుల ఆదేశాల మేరకే తాము నర్సరీని ఏర్పాటు చేశామని కొండ్రోనిపల్లి సర్పంచ్ సుధాకర్ స్పష్టం చేయగా, ఆ స్థలంలో నర్సరీ ఉండకూడదని గోటూరు గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ వాగ్వివాదానికి దిగారు. గతంలో నర్సరీ కేంద్రం గుట్టపై ఉండేదని, అక్కడ నీటి సౌకర్యం లేకపోవడంతో మొక్కలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని సర్పంచ్ తెలిపారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్, ఎంపీడీవో మరియు తహసీల్దార్ల అనుమతితో పాటు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల తీర్మానం మేరకు రైతు వేదిక పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో నర్సరీని ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. రైతు వేదిక పక్కన నర్సరీ ఏర్పాటు చేయడం ఇష్టం లేని గోటూరు గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు గత నెల రోజులుగా తమను వేధింపులకు గురి చేస్తున్నారని సర్పంచ్ సుధాకర్ ఆరోపించారు. గురువారం నాడు కొందరు వ్యక్తులు నర్సరీలోకి చొరబడి, అక్కడి మొక్కలను పీకివేసి, సామాగ్రిని సమీపంలోని కాలువలో పడేశారని ఆయన



పేర్కొన్నారు. తమ గ్రామానికి చెందిన సర్పంచ్ అని కూడా చూడకుండా దుర్భాషలాడారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ధన్వాడ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నిబంధనల ప్రకారం అధికారుల అనుమతితోనే నర్సరీ కొనసాగుతోందని సర్పంచ్ పోలీసులకు వివరించారు. పోలీసులు ఇరువర్గాలతో మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సౌందర్య, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# లక్కీ డ్రా... కానీ ఇల్లు మాత్రం లక్కీ కాలేదు!

## ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం

- ఇల్లిస్తామని మోసం నాలుగేళ్లుగా నిరాశ్రయుల్ని తిప్పలు పెట్టిస్తున్న ప్రభుత్వం!
- గజ్వేల్‌లో డబుల్ బెడ్‌రూమ్ కల నరకయాతనగా మారింది.



**నేటి సాక్షి గజ్వేల్:** గజ్వేల్ పట్టణంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం పట్ల లబ్ధిదారులు మరియు భూ నిర్వాసితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిరుపేదల కోసం నిర్మించిన 1200 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో లక్కీ డ్రా ద్వారా ఎంపికైన 1100 మందికి ఇప్పటికీ ఇళ్లు కేటాయించకపోవడం, పట్టాలు ఇవ్వకపోవడం బాధితులను తీవ్ర అనిశ్చితిలోకి నెట్టింది. నాలుగేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా తమకు న్యాయం జరగలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, మల్లన్న సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో నిర్వాసితులైన కుటుంబాలను తాత్కాలికంగా పట్టణ శివారులోని ప్రభుత్వ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో ఉంచారు. అయితే వారికి ఇవ్వాల్సిన పూర్తి నష్టపరిహారం ఇప్పటికీ అందలేదు. కొంతమందికి ఇళ్లు, మరికొందరికి ఓపెన్ ప్లాట్లు కేటాయించగా, ఒంటరి మహిళలు మరియు యువతకు ప్రకటించిన ప్యాకేజీలు కూడా అమలుకాలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. దీంతో ఒకే ఇంటిపై లక్కీ డ్రా లబ్ధిదారులు, భూ నిర్వాసితులు ఇద్దరూ హక్కులు చెప్పుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బాధితులు మండిపడుతున్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఇళ్ల తాళాలు తొలగించి లక్కీ డ్రా లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించే చర్యలు చేపట్టినా, నివసిస్తున్న నిర్వాసితులు మాత్రం తమకు పూర్తి నష్టపరిహారం చెల్లించే వరకు ఇళ్లు ఖాళీ చేయబోమని స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు తమ బాధలను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ బాధితులు ఘాటుగా విమర్శలు చేస్తున్నారు. "ఇళ్లు ఇస్తామని చెప్పి నాలుగేళ్లుగా మోసం చేస్తున్నారు౯ మా సమస్యను వెంటనే పరిష్కరించాలి" అని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇళ్ల సమస్యను తక్షణమే పరిష్కరించాలని, లేకపోతే ఆందోళనకు దిగుతామని బాధితులు హెచ్చరించారు

# దేవాలయ భూమిలో అక్రమ దారి తొలగింపు

- ఆర్‌డీఓ జివాకర్ రెడ్డి పరిశీలన - సర్వే నెం.1492లో కందకం గుర్తింపు

**నేటి సాక్షి - కోరుట్ల,( రాధారపు నర్సయ్య ):** కోరుట్ల పట్టణంలోని ఆదర్శనగర్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయానికి చెందిన పట్టా భూమిలో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా వేసిన దారిని అధికారులు తొలగించారు. సర్వే నెంబర్ 1492లో ఉన్న ఎకరాలు 3-17 గుంటల విస్తీర్ణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ విషయంపై సమాచారం అందుకున్న వెంటనే కోరుట్ల రెవెన్యూ డివిజన్ అధికారి జివాకర్ రెడ్డి, కోరుట్ల తహశీల్దార్ కృష్ణ చైతన్య, మండల సర్వేయర్ కుమారస్వామి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అక్రమంగా తీసిన కందకాన్ని గుర్తించి, దారిని తొలగించే చర్యలు చేపట్టారు. దేవాలయ ఆస్తులపై ఎలాంటి అక్రమాలకూ తావులేదని అధికారులు స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పర్యవేక్షణను మరింత



కట్టుదిట్టం చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ ఎతిరాజం నర్సయ్య మాట్లాడుతూ దేవాలయ భూములను కాపాడేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధర్మకర్తలు నేతి శ్రీనివాస్, కటుకం దివాకర్, కోట గంగాధర్, గొడికె రాములు, చిలువేరి విజయ్ కుమార్, శ్రీమతి చిట్యాల పద్మ, ఈఓ ఎం. విక్రమ్, జూనియర్ అసిస్టెంట్ పి. నర్సయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి



## కలెక్టర్ గరిమ అగ్రవాల్

**నేటి సాక్షి, సిరిసిల్ల (ప్రతినిధి శివకుమార్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'పీఎం శ్రీ' (గ్రావీ ాాఎ=×) పథకం కింద చేపట్టిన అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, అధికారులకు మరియు కాంట్రాక్టర్లకు పలు కీలక సూచనలు చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదుల అవసరం ఉందని గుర్తించిన కలెక్టర్, పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. రానున్న 20 రోజుల్లోగా నిర్మాణ పనులన్నీ పూర్తి చేసి, విద్యార్థుల వినియోగంలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం పాఠశాలలో ఉన్న గదుల వివరాలు, విద్యార్థుల సంఖ్యను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను కూడా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పదో తరగతి గదికి వెళ్లిన కలెక్టర్ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులంతా కష్టపడి చదవాలని సూచించారు. "ప్రతి విద్యార్థి అన్ని సబ్జెక్టులను ధారాళంగా చదవాలి మరియు స్పష్టంగా రాయాలి" అని ఆమె పేర్కొన్నారు. చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

# కన్మనూరులో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం...



**నేటి సాక్షి,నారాయణపేట, (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని కన్మనూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో భాగంగా కన్మనూర్ గ్రామంలో వడ్ల రాణి,వడ్ల శివరామ చారి ఇల్లు ప్రారంభ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ అంకిత సురేందర్ గౌడ్,ఎంపీడీఓ పృధ్వీరాజ్ , కాంగ్రెస్ జిల్లా నాయకులు సూర్య మోహన్ రెడ్డి ఎంపిఓ, పావని,ఏఈ ప్రవలిక, పంచాయతీ సెక్రెటరీ రమేష్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల చెంతకి పోలీసులు

## ఘటనపై వెంటనే స్పందించిన నారాయణపేట రూరల్ పోలీసులు



**నేటి సాక్షి నారాయణపేట,(ఇమామ్ సాబ్ ):** నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోటకొండ గ్రామంలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాద ఘటనపై పోలీసులు తక్షణమే స్పందించి ఘటన స్థలంలోనే కేసు నమోదు చేశారు. కోటకొండ గ్రామానికి చెందిన మూడింట్ల కృష్ణ (తండ్రి: వెంకటప్ప)కు చెందిన టీఎస్ ఓజియుఏ 4941 నంబర్ గల ఆటోను రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా నిప్పు పెట్టి కాల్చివేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ విషయం తెలిసిన వెంటనే రూరల్ ఎస్సై రాముడు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడితో మాట్లాడి వివరాలు సేకరించారు. బాధితుడి నుంచి పిటిషన్ స్వీకరించి, అక్కడికక్కడే కేసు నమోదు చేసి నమోదు చేయడం జరిగింది. ఘటనకు సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై రాముడు తెలిపారు. ఆటోకు నిప్పు పెట్టిన వ్యక్తులను త్వరలోనే గుర్తించి పట్టుకుని, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఆస్తుల రక్షణకు పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని, ఏదైనా అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు.

# వికసిత్ భారత్ దిశగా యువత ఆలోచనలు

## గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ గోడ పత్రిక విడుదల




**నేటి సాక్షి గజ్వేల్:** గజ్వేల్ ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి డిగ్రీ కళాశాలలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2026 గోడ పత్రికను ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీ ఎస్. గణపతి రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు 2047 నాటికి భారత దేశం ఎలా అభివృద్ధి చెందాలనే దిశలో తమ ఆలోచనలు వ్యక్తపరచే విలువైన వేదిక లభిస్తుందని తెలిపారు. దేశ భవిష్యత్తు నిర్మాణంలో యువత చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాట్లాడిన కోఆర్డినేటర్ శ్రీ వి. మార్కండేయ, రాబోయే శనివారం సిద్ధిపేటలోని విపంచి కళానిలయంలో జిల్లాస్థాయి యూత్ పార్లమెంట్ సమావేశం నిర్వహించబడుతుందని తెలిపారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. వెంకటేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ పెద్దిరాజు, డాక్టర్ ఎస్. మహేందర్, డాక్టర్ వై. రామచంద్రం, పరీక్షల నియంత్రణ అధికారి ఎం. భవాని, అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రీ విజయ భాస్కర్ రెడ్డి, వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు జే. లక్ష్మీనరసయ్యతో పాటు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు



- మేడిపల్లి, కోరుట్ల, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం కేంద్రాల తనిఖీ - అదనపు కలెక్టర్ బి.ఎస్. లత ఆదేశాలు

**నేటి సాక్షి, కోరుట్ల,(రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. గురువారం మేడిపల్లి, కోరుట్ల, మెట్‌పల్లి మరియు ఇబ్రహీంపట్నం మండలాల్లోని పలు పరీక్షా కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత స్వయంగా సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో ప్రశ్నపత్రాల భద్రత, హాల్‌టికెట్ల పరిశీలన విధానం, విద్యార్థుల కూర్చునే ఏర్పాట్లు వంటి అంశాలను అదనపు కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. పరీక్షలు పారదర్శకంగా, క్రమశిక్షణతో సాగుతున్నాయా అనే విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా గదుల్లో సరిపడా వెలుతురు, తాగునీటి సౌకర్యం, శౌచాలయాల నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయగలిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మొబైల్ ఫోన్లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ నిరంతరంగా కొనసాగాలని, ప్రత్యేక తనిఖీ దళాలు (ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు) నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో పారదర్శకత, క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని, పరీక్షా సిబ్బంది తమ విధులను నిబద్ధతతో, బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కూడా సూచించారు. ఈ సందర్భంగా కోరుట్లలోని పీఆర్‌బీఎం జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ బి.ఎస్. లత సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన కేంద్ర నిర్వహణ, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రంలో క్రమశిక్షణతో పాటు పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నారని అభినందించారు. ఈ పరిశీలనలో కోరుట్ల రెవెన్యూ డివిజన్ అధికారి జీవాకర్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి బి. నారాయణ, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. పరీక్షలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ లత సూచించారు.

# జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు

- భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ అధికారులు
- ఎస్పీ అశోక్ కుమార్

**నేటి సాక్షి, జగిత్యాల,(రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. పరీక్షల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీసు సిబ్బందిని నియమించి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. పరీక్ష సమయం మొత్తం పెట్రోలింగ్ నిర్వహిస్తూ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. పరీక్షలు ముగిసే వరకు సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా కొనసాగుతారని పేర్కొన్నారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని ఎస్పీ సూచించారు. వారికి అవసరమైన భద్రతా వాతావరణాన్ని కల్పించడం పోలీస్ శాఖ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. పరీక్షా విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండి, పరీక్షలు పారదర్శకంగా సాగేందుకు సహకరించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని పోలీసులు వెల్లడించారు.



# గంజాయి సాగు కేసులో నిందితుడికి 7 ఏళ్ల కఠిన కారాగార శిక్ష



- రూ.10,000 జరిమానా విధిస్తూ తీర్పు - 1వ అదనపు జిల్లా & సెషన్స్ న్యాయమూర్తి ఎస్. నారాయణ
- మత్తు పదార్థాలపై కఠిన చర్యలు కొనసాగుతాయి: ఎస్పీ

**నేటి సాక్షి - జగిత్యాల,(రాధారపు నర్సయ్య):** గంజాయి సాగు, సరఫరా మరియు అమ్మకానికి పాల్పడిన నిందితుడికి న్యాయస్థానం 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధించింది. ఈ కీలక తీర్పును 1వ అదనపు జిల్లా & సెషన్స్ న్యాయమూర్తి ఎస్. నారాయణ వెలువరించారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామానికి చెందిన మెస్రం నాగనాథ్ (41) తన వ్యవసాయ భూమిలో సోయా, ప్రత్తి పంటలతో పాటు రహస్యంగా గంజాయి మొక్కలను సాగు చేసినట్లు విచారణలో వెల్లడైంది. అదనపు డబ్బు సంపాదన కోసం ప్రత్తి పంటల మధ్య గంజాయి పెంచి, ఆకులు మరియు కొమ్మలను కోసి ఎండబెట్టి గంజాయిగా తయారు చేసి స్వయంగా వినియోగించడంతో పాటు యువతకు విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. 07-11-2023న ఉదయం నిందితుడు ఎండు గంజాయిని సంచిలో పెట్టుకొని రాయికల్ పట్టణానికి విక్రయించేందుకు తీసుకువచ్చిన సమయంలో పోలీసులు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా అతని వద్ద 1.5 కిలోల (1500 గ్రాములు) ఎండు గంజాయి లభ్యమైంది. పంచనామా నిర్వహించి గంజాయి మరియు ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిపై మత్తు పదార్థాల నియంత్రణ చట్టం (ఎన్‌డీపీఎస్ చట్టం) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్‌ను న్యాయస్థానంలో దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం నేడు గౌరవ న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారించి 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ రూ.10,000 జరిమానా విధించింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాల సాగు, సరఫరా, రవాణా మరియు విక్రయం చట్టవిరుద్ధమే కాకుండా సమాజానికి హానికరమని తెలిపారు. ఇటువంటి నేరాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు తెలియజేయాలని కోరారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి రూరల్ ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్, ఎస్.ఐ అజయ్, ప్రజా అభియోజకుడు కే. మల్లేశం గౌడ్, సి.ఎం.ఎస్ ఎస్సై ఎస్. శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ నరేష్, సి.ఎం.ఎస్ కానిస్టేబుళ్లు రాజు నాయక్, కిరణ్ కుమార్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# బెట్టింగ్ యాప్ బారిన మరో ప్రాణం..బలి.!

- లక్ష్మీపూర్‌లో గీతాకార్మికుడు ఆత్మహత్య
- రూ.25 లక్షలు కోల్పోయినట్లు అంచనా
- బెట్టింగ్ యాప్‌లపై కట్టడి చేయాలంటూ గ్రామస్థుల డిమాండ్





**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో,( రాధారపు నర్సయ్య ):** జగిత్యాల జిల్లాలో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల కారణంగా మరో విషాదం చోటుచేసుకుంది. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మహేశ్ అనే గీతాకార్మికుడు బెట్టింగ్ యాప్‌లో భారీగా డబ్బులు పెట్టి నష్టపోయినట్లు సమాచారం. సుమారు రూ.25 లక్షలు పెట్టుబడి పెట్టిన మహేశ్‌కు డబ్బులు తిరిగి రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. బెట్టింగ్ యాప్‌లలో లాభాల ఆశతో డబ్బులు పెట్టిన మహేశ్ వరుసగా నష్టపోయినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన డబ్బులు రాకపోవడంతో ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఒత్తిడికి లోనైనట్లు సమాచారం. ఈ ఘటనతో కుటుంబంలో విషాదం నెలకొంది. మహేశ్‌కు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నట్లు తెలిసింది. జగిత్యాల జిల్లాలో బెట్టింగ్ యాప్‌ల వల్ల బాధితుల సంఖ్య పెరుగుతుండటంపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యువత, కార్మికులు సులభ డబ్బుల ఆశతో ఇలాంటి యాప్‌లకు బలవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే బెట్టింగ్ యాప్‌లను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి గ్రామానికి వెళ్లి మహేశ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి ధైర్యం చెప్పి, ప్రభుత్వం బాధిత కుటుంబానికి సహాయం చేయాలని కోరుతామని తెలిపారు. బెట్టింగ్ యాప్‌ల మాయాజాలానికి లోనుకాకుండా ప్రజలు జాగ్రత్తగఉండాలని, ఆర్థికంగా నష్టపోకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# పరీక్షా సమయాల్లో అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలి



**నేటిసాక్షి సిరిసిల్ల (శివకుమార్):** ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్న ఈ కీలక సమయంలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సిరిసిల్ల డిపో పరిధిలోని ప్రతి గ్రామానికి సమయానికి బస్సులు నడిచేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కంచర్ల రవి గౌడ్ డిపో మేనేజర్‌ను కోరారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పరీక్షా కేంద్రాలకు వచ్చే విద్యార్థులు బస్సులు లేని కారణంగా ఆలస్యంగా చేరుకోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకూడదని స్పష్టం చేశారు. అవసరమైతే ప్రత్యేక మరియు అదనపు బస్సు సర్వీసులు వెంటనే ఏర్పాటు చేయాలని, పరీక్ష రోజుల్లో విద్యార్థులు ఎక్కడ చేతి ఎత్తినా బస్సులు తప్పనిసరిగా ఆపాలని డ్రైవర్లకు కఠిన ఆదేశాలు జారీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని అత్యవసరంగా పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలని డిపో అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టి శ్రీనివాస్,వడ్లూరి వేణు, నవీన్,సాయి, పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల నిజం చేయడమే లక్ష్యం

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**నేటిసాక్షి , చందుర్తి (సతీష్):** పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.. చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు


# బాలాజీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం

**ఆర్ ఎక్స్పర్ట్ టెలిమెడిసిన్,**



**నేటి సాక్షి, కొడిమ్యాల:** కొడిమ్యాల గ్రామంలో శ్రీబాలాజీ హాస్పిటల్ డాక్టర్ జగదీప్ ఆధ్వర్యంలో ఆర్ ఎక్స్పర్ట్ టెలిమెడిసిన్ డిజిటల్ ఈ-క్లినిక్ ద్వారా శ్రీ బాలాజీ హాస్పిటల్ లో ఉచిత ఆరోగ్య శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు రక్త పరీక్షలు నిర్వహించి, నిపుణుల వైద్య సలహాలు అందించబడినవి. ఈ సందర్భంగా ఆర్ ఎక్స్పర్ట్ రీజినల్ హెడ్ వెంకటేష్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను చేరువ చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. ఇకపై ఆరోగ్య సమస్యల కోసం నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, ఆర్ ఎక్స్పర్ట్ టెలిమెడిసిన్ సేవల ద్వారా ప్రముఖ నిపుణుల కన్సల్టేషన్ సేవలు స్థానికంగా అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ శిబిరానికి గ్రామ ప్రజలు విశేషంగా హాజరై సేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమానికి సహకరించిన గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలకు నిర్వాహకులు మొగిలిపాలెం శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

# రక్తదానం చేసిన యువ రైతు అడువాలా రమేష్




**నేటి సాక్షి-మేడిపల్లి:** బక్కూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానం చేసిన యువకుడు మల్లాపూర్ మండలం సిరిపూర్ గ్రామానికి చెందిన రాజం కు శస్త్ర చికిత్స సమయంలో రక్తం అవసరమని వైద్యులు సూచించగా, కుటుంబ సభ్యులు బక్కూరి ఫౌండేషన్ చైర్మన్ నరేష్ ని సంప్రదించారు. బక్కురి ఫౌండేషన్ చైర్మన్ నరేష్ సూచన మేరకు ముందుకొచ్చిన భీమారం మండలం కమ్మరి పేట గ్రామానికి చెందిన అడువాలా రమేష్, రక్తదానం చేసి మానవతా సేవకు నిదర్శనంగా నిలిచాడు. సమయానికి రక్తం అందడంతో రాజం ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన అడువాల రమేష్ ను బక్కూరి ఫౌండేషన్ చైర్మన్ నరేష్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, ఆసుపత్రి సిబ్బందిని అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పలువురు పేర్కొన్నారు.



# ఘనంగా అర్జున్ -సానియా ప్రీవెడ్డింగ్ ఈవెంట్

## వచ్చే నెల 5న జరుగనున్న వివాహం

క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ కుమారుడు అర్జున్ తెందుల్కర్ వివాహం వచ్చే నెల 5న జరగనుంది. అర్జున్ తన స్నేహితురాలు సానియా చందోక్?ను పెళ్లాడనున్నాడు. ఈ క్రమంలో సచిన్ ఇంట పెళ్లి పనులు షురూ అయ్యాయి. ఇప్పటికే ప్రధాని నరేంద్రమోదీ సహా పలువురు సెలబ్రిటీలు, రాజకీయ ప్రము-ఖులకు ఆహ్వాన పత్రిక అందించారు. తాజాగా రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, నీతా అంబానీ జామ్‌నగర్‌లో అర్జున్ -సానియా ప్రీ వెడ్డింగ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌లో సచిన్ ఎమోషనల్ స్పీచ్ ఇచ్చారు. ఈ ఈవెంట్‌లో సచిన్ మాట్లాడాడు. తమ కుమారుడి ప్రీ వెడ్డింగ్ ఈవెంట్‌ను నిర్వహించినందుకు ముకేశ్ అంబానీ కుటుంబానికి థాంక్స్ చెప్పాడు. 'మమ్మల్ని ఇక్కడికి ఆహ్వానించినందుకు మీకు థాంక్స్. అర్జున్- సానియా జంటను ఆశీర్వదించేందుకు ఇది సరైన వేదిక. ఎప్పుడైతే మన కుమారుడు, ఎవరైనా అమ్మాయిని ఇంటికి తీసుకొచ్చి పరిచయం చేశాడంటే, అప్పుడే కొడుకు పెద్ద వాడయ్యాడని తెలుస్తుంది. వాళ్లు (అర్జున్- సానియా) ఒకరినొకరు ఇష్టపడుతున్నారు. నిన్ను ప్రేమించే వ్యక్తిని పెళ్లి చేసుకుంటున్నావు. అర్జున్ నిన్ను చూస్తూ గర్విస్తున్నా' అని సచిన్ కుమారుడి పట్ల ఎమోషనల్‌గా మాట్లాడాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.'రెండేళ్ల కిందట అనంత్- రాధిక పెళ్లి జరిగిన ఈ జామ్‌నగర్‌లోనే మళ్లీ అర్జున్- సానియా వివాహ వేడుక కోసం మనం కలుసుకున్నాం. సచిన్- అంజలీ ఎల్లప్పుడూ మా కుటుంబ సభ్యులే. ఈరోజు మీకు ఆతిథ్యం ఇస్తున్నందుకు మాకు సంతోషంగా ఉంది. మా స్కూల్‌లో చదువుతున్నప్పటి నుంచి అర్జున్‌ను నేను చూస్తున్నా. ఇప్పుడు నీ జీవితంలో ముఖ్యమైన, అందమైన జర్నీని ప్రారంభిస్తున్నావు. సానియా నీ చుట్టూ పాజిటివిటీ ఉంది. మీ ఇద్దరు ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నాం' అని నీతా అంబానీ అన్నారు. కాగా, సచిన్ తెందుల్కర్?కు అంబానీ కుటుంబంతో మంచి సంబంధాలు ఉన్నాయి. ముకేశ్‌తో సచిన్‌కు వ్యక్తిగతంగానూ అనుబంధం ఉంది. ముఖ్యంగా ఐపీఎల్‌లో సచిన్ ముంబయి ఇండియన్స్‌కు ఆడుతున్నప్పటి నుంచి ఇంకా దగ్గరయ్యారు. తెందుల్కర్ క్రికెట్ నుంచి (2013) రిటైరైన తర్వాత కూడా ఐపీఎల్‌లో ముంబయి ఫ్రాంచైజీతోనే కొనసాగుతున్నారు. దశాబ్ద కాలంగా సచినే ముంబయికి మెంటార్?గా వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా అర్జున్ తెందుల్కర్ కూడా ముంబయి జట్టుతోనే ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. గతసీజన్?దాకా ముంబయితోనే ఉన్నాడు. అయితే 2026 సీజన్?కుగాను అతడిని లఖ్?నవూ సూపర్ జెయింట్స్ ట్రేడింగ్?లో తీసుకుంది. పెంపుడు జంతువులకు గ్రూమింగ్, వెల్?నెస్ బ్రాండ్ అయిన మిస్టర్ పావ్స్ పెట్ స్పా ఌ స్టోర్ ాూా వ్యవస్థాపకురాలు సానియా చందోక్. ఆమె 2020లో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి పట్టా అందుకున్నారు. ఆ తర్వాత వెటర్నరీ టెక్నీషియన్‌గా అర్హత సాధించారు. ఆమె గ్రావిస్ గ్రూప్ చైర్మన్ రవి ఘాయ్ మనవరాలు. ఆమె తల్లిదండ్రులు సన్నీ - గౌరిక కూడా ఈ సంస్థతో సంబంధం కలిగి ఉన్నారు.

# రంజీ ట్రోఫీ ఫైనల్..

## 584 పరుగులు చేసిన జమ్మూకశ్మీర్

**బెంగళూరు:** హుబ్లీ వేదికగా కర్ణాటకతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో జమ్మూ కశ్మీర్ దుమ్ము రేపింది. 527/6 ఓవర్ నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను ప్రారంభించిన జమ్మూ జట్టు 584 పరుగుల భారీ స్కోర్ చేసి ఆలౌటైంది. ప్రత్యర్థి కర్ణాటకు 585 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. రెండో రోజు హాఫ్ సెంచరీ సాధించి అజేయంగా నిలిచిన సాహిల్ లోత్రా నేడు 72 పరుగులకు పెవిలియన్ చేరాడు. 20 రన్స్‌తో బ్యాటింగ్‌కు దిగిన అబిద్ ముస్తాక్ మరో 8 పరుగులు చేసి ఔటయ్యాడు. ఆఖరి వికెట్‌గా యుద్వీర్ సింగ్(30) రనౌట్ అయ్యాడు. అయితే జమ్మూ కశ్మీర్ ఇన్నింగ్స్‌లో ఓ శతకం, ఐదు హాఫ్ సెంచరీలు నమోదు కావడం విశేషం. శుభమ్ పుందిర్(121), హసన్(88), అబ్దుల్ సమద్(61), కన్హియా వాదవాన్(70), సాహి లోత్రా(72) అద్భుతంగా రాణించారు. కర్ణాటక బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 5 వికెట్ల ప్రదర్శన చేశాడు. యుద్వీర్ పాటిల్, విజయ్ కుమార్ వైశాఖ్, శ్రేయస్ గోపాల్, శిఖర్ శెట్టి తలో వికెట్ తీసుకున్నారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కర్ణాటక తడబడుతోంది. 44 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 142 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్(13), దేవ్‌దత్ పడిక్కల్(11), కరుణ్ నాయర్(0), సమరన్ రవిచంద్రన్(0) తీవ్రంగా విఫలమయ్యారు. మయాంక్ అగర్వాల్(85లి) హాఫ సెంచరీ సాధించాడు. మరో ఎండ్‌లో శ్రేయాస్ గోపాల్(25లి) కొనసాగుతున్నాడు. జమ్మూ బౌలర్లలో అకిబ్ నబీ దార్ 3 వికెట్లతో చెలరేగాడు. సునీల్ కుమార్ ఓ వికెట్ తీసుకున్నాడు.



# బెన్నెట్ పోరాటం వృథా

## జింబాబ్వేపై టీమిండియా ఘన విజయం!






చెన్నై: వరల్డ్ కప్ సూపర్ 8 దశలో భాగంగా చెన్నైలోని స్టేడియం వేదికగా జరిగిన కీలక మ్యాచ్‌లో టీమిండియా జింబాబ్వేపై 72 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 256 పరుగులు చేయగా, లక్ష్య ఛేదనలో జింబాబ్వే 6 వికెట్ల నష్టానికి 184 పరుగులు మాత్రమే చేసింది. టీమిండియా ఇన్నింగ్స్‌లో ఓపెనర్ సంజూ శాంసన్ వేగంగా 24 పరుగులు చేసి మంచి ఆరంభం ఇచ్చాడు. అభిషేక్ శర్మ 55 పరుగులు, ఇషాన్ కిషన్ 38 పరుగులతో జట్టుకు మంచి ఆరంభాన్ని ఇచ్చారు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 33 పరుగులు చేసి స్కోరు వేగం పెంచాడు. చివర్లో హార్దిక్ అర్ధ శతకం సాధించి జట్టును భారీ స్కోరు దిశగా నడిపించాడు. తిలక్ వర్మ దూకుడుగా 44 పరుగులు చేసి భారత్‌కు మంచి స్కోరు అందించాడు. 256 పరుగులు టీమిండియాకు టీ20 వరల్డ్ కప్‌లో అత్యధిక స్కోర్. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే తరపున బ్రియాన్ బెన్నెట్ అద్భుతంగా ఆడాడు. అతడు చివరి వరకు అవుట్ కాకుండా 97 పరుగులు చేసి ఒంటరిగా పోరాడాడు. సికందర్ రాజా 31 పరుగులు చేసినా, మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. భారత్ బౌలర్లలో అర్షదీప్ సింగ్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. అతడు కీలక సమయంలో మూడు వికెట్లు తీసి జింబాబ్వేను కట్టడి చేశాడు. ఇతర బౌలర్లు కూడా సమిష్టిగా రాణించి జింబాబ్వేను లక్ష్యానికి దూరంగా నిలిపారు.

# గొప్ప సహాయం చేసిన దక్షిణాఫ్రికా

## టీమిండియా సెమీఫైనల్స్ ఛాన్సెస్ మరింతగా మెరుగు!






**అహ్మదాబాద్ :** టీ20 ప్రపంచకప్ 2026 సూపర్-8లో భాగంగా జరిగిన కీలక పోరులో వెస్టిండీస్‌పై దక్షిణాఫ్రికా ఘనవిజయం సాధించింది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రోటీస్ జట్టు 9 వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తు చేసింది. ఈ గెలుపు దక్షిణాఫ్రికా సెమీస్ అవకాశాలను మెరుగుపరచడమే కాకుండా, టీమిండియా ఆశలను కూడా సజీవంగా ఉంచింది. ఈ రోజు జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ నిర్దేశించిన 177 పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా కేవలం ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ ఐడెన్ మార్క్రామ్ మెరుపు ఇన్నింగ్స్‌తో జట్టును విజయ పథంలో నడిపించాడు. అతనికి క్వింటన్ డి కాక్, ర్యాన్ రికెల్టన్ చక్కని సహకారం అందించారు. ఈ పోరులో ఇంకా 23 బంతులు మిగిలి ఉండగానే (16.1 ఓవర్లలోనే) లక్ష్యాన్ని ఛేదించి దక్షిణాఫ్రికా విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.

### విండీస్ రన్ రేట్‌కు భారీ గండి..

ఈ ఘోర పరాజయం వెస్టిండీస్ సెమీస్ అవకాశాలపై దెబ్బకొట్టింది. 9 వికెట్ల తేడాతో ఓడిపోవడంతో వెస్టిండీస్ నెట్ రన్ రేట్ భారీగా పడిపోయింది. మ్యాచ్‌కు ముందు ం5.35 గా ఉన్న విండీస్ రన్ రేట్, ఇప్పుడు ం1.791 కి పడిపోయింది. ఇది భారత్‌కు కలిసొచ్చే అంశం. దక్షిణాఫ్రికా విజయం తర్వాత గ్రూప్-ూా పాయింట్ల పట్టికలో సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. ఈ రోజు జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ ఓడిపోవడంతో ఇప్పుడు టీమిండియా భవిష్యత్తు తన చేతుల్లోనే ఉంది. రన్ రేట్ గందరగోళం లేకుండా భారత్ సెమీస్ చేరడానికి మార్గం సుగమమైంది. భారత్ తన నెక్స్ట్ రెండు మ్యాచ్‌ల్లో (జింబాబ్వే, వెస్టిండీస్) తప్పనిసరిగా గెలవాల్సి ఉంటుంది. ఈ రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధిస్తే టీమిండియా నేరుగా సెమీఫైనల్‌కు దూసుకెళ్తుంది. అహ్మదాబాద్‌లో దక్షిణాఫ్రికా కొట్టిన దెబ్బకు వెస్టిండీస్ కోలుకోలేకపోయింది. ఈ ఫలితం గ్రూప్‌లో దక్షిణాఫ్రికాను అగ్రస్థానానికి చేర్చడమే కాకుండా, భారత అభిమానుల్లో కొత్త ఆశలు చిగురించేలా చేసింది.

# మార్క్రమ్ మెరుపులు.. డీకాక్ దూకుడు!

- విండిస్ పై సౌతాఫ్రికా భారీ విజయం!
- వెస్టిండీస్ మొదట బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 8 వికెట్లకు 176 పరుగులు
- సౌతాఫ్రికా కేవలం 16.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి విజయం..

**అహ్మదాబాద్:** టీ20 వరల్డ్ కప్ సూపర్ 8 గ్రూప్-1లో భాగంగా అహ్మదాబాద్ లో సౌతాఫ్రికా వెస్టిండీస్ పై 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 177 పరుగుల లక్ష్యాన్ని సౌతాఫ్రికా కేవలం 16.1 ఓవర్లలోనే ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది. మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 176 పరుగులు చేసింది. టాప్ ఆర్డర్ పూర్తిగా విఫలమవడంతో జట్టు ఒక దశలో 83/7 వద్ద కష్టాల్లో పడింది. అయితే జాసన్ హోల్డర్ (49), రోమారియో షెఫర్డ్ (52లి) అద్భుత పోరాటంతో జట్టుకు గౌరవప్రదమైన స్కోర్ ను అందించారు. వీరిద్దరి మధ్య 89 పరుగుల భాగస్వామ్యం నమోదు అయింది. సౌతాఫ్రికా బౌలర్లలో లుంగీ ఎంగిడి 3 వికెట్లు.. రబడా, బోస్చ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. 177 పరుగుల లక్ష్య ఛేధనలో దక్షిణాఫ్రికా బ్యాటర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడారు. కెప్టెన్ ఐడెన్ మార్క్రమ్ (ూఱఅవవఅ మీఖతీఎత్ఖఎ) 46 బంతుల్లో 82 పరుగులతో నాటౌట్‌గా నిలిచి మ్యాచ్ ను వన్ సైడ్ వార్ చేసేశాడు. అతినికి తోడుగా వికెట్ కీపర్, బ్యాటర్ డీకాక్ 24 బంతుల్లో 47 పరుగులు చేసి మంచి ఆరంభం ఇచ్చాడు. డీకాక్ అవుట్ అయ్యాక వచ్చిన ర్యాన్ రికెల్టన్ (45లి) తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. సౌతాఫ్రికా బ్యాటర్లు బౌండరీలు, సిక్సర్లతో విండీస్ బౌలర్లపై ఒత్తిడి తెచ్చారు. 23 బంతులు మిగిలుండగానే విజయం అందుకున్నారు. ఈ విజయంతో దక్షిణాఫ్రికా దాదాపు సెమీఫైనల్ బెర్త్ కన్ఫామ్ చేసుకుంది. భారీ లక్ష్యాన్ని సులభంగా చేధించడం జట్టుకు మంచి నెట్ రన్‌రేట్‌ను కూడా అందించింది. మరోవైపు, వెస్టిండీస్‌కు ఈ ఓటమి గట్టి దెబ్బగా మారింది. అయితే వెస్టిండీస్ భారీ తేడాతో ఓడడం భారత్ కు కాస్త ఊరటనిచ్చే అంశం.







# ఒక్క సినిమాతో ఇండస్ట్రీని షేక్ చేసిన 22 ఏళ్ల బ్యూటీ

సినిమా రంగంలో కొందరు నటీమణులు దశాబ్దాల కాలం వేచి చూసినా దక్కని గుర్తింపును, మరికొందరు తమ తొలి చిత్రంతోనే సొంతం చేసుకుంటారు. సరిగ్గా ఇదే రీతిలో బాలీవుడ్‌లో ఇప్పుడు ఒకే ఒక్క సినిమాతో స్టార్‌డమ్ దక్కించుకుని, అందరి దృష్టిని ఆకర్షిస్తోంది 22 ఏళ్ల యువ నటి అనీత్ పద్ద. కేవలం అందంతోనే కాకుండా తన అద్భుతమైన అభినయంతో ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తూ సరికొత్త రికార్డులను సృష్టించింది. ప్రముఖ దర్శకుడు మోహిత్ సూరి దర్శకత్వంలో తెరకెక్కిన 'సయ్యారా' సినిమాతో అనీత్ వెండితెరకు పరిచయమైంది. జూలై 18న ఎటువంటి భారీ అంచనాలు లేకుండా విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఊహించని విజయాన్ని నమోదు చేసింది. ఇప్పటివరకు ఈ సినిమా రూ. 570 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి, ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచింది. ఒక డెబ్యూ హీరోయిన్ సినిమా ఈ స్థాయిలో కలెక్షన్స్ సాధించడం బాలీవుడ్‌లో అరుదైన రికార్డుగా నిలిచింది. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో జన్మించిన అనీత్ పద్ద.. ప్రస్తుతం ఢిల్లీ విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తోంది. నటనపై ఉన్న మక్కువతో మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టిన ఈమె, పలు వాణిజ్య ప్రకటనల్లో నటించి గుర్తింపు పొందింది. ఆ క్రమంలోనే 'సయ్యారా'లో కథానాయికగా అవకాశం దక్కించుకుంది. మొదటి సినిమాలోనే పరిణతి చెందిన నటనను కనబరచడంతో స్టార్ హీరోలు సైతం ఆమె నటనకు ఫిదా అయిపోయారు. ఈ సినిమా చూసిన పలువురు సినీ ప్రముఖులు, స్టార్ హీరోలు సోషల్ మీడియా వేదికగా అనీత్ నటనపై ప్రశంసలు కురిపించారు. యువతలో ఆమెకు విపరీతమైన క్రేజ్ పెరగడంతో, ప్రస్తుతం గూగుల్‌లో ఈ అమ్మడి గురించి తెలుసుకోవడానికి నెటిజన్లు తెగ ఆరా తీస్తున్నారు. తొలి ప్రయత్నంలోనే వందల కోట్ల క్లబ్‌లో చేరిన అనీత్ పద్ద, భవిష్యత్తులో బాలీవుడ్‌ను ఏలే స్టార్ హీరోయిన్ అవుతుందని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



# వివాహ బంధంతో ఒక్కటైన విరోష్

**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** నటులు విజయ్ దేవరకొండ, రష్మిక వివాహబంధంతో ఒక్కటైనట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం 10.10కి రష్మిక మెడలో విజయ్ మూడుముళ్లు వేసినట్లు సమాచారం. దీంతో ఈ జంటకు అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్ట్‌లు పెడుతున్నారు. ఈ పెళ్లి వేడుక రెండు సంస్కృతులు, సంప్రదాయాల కలయికగా జరుగుతోంది. ఉదయం విజయ్ వైపు నుంచి హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహం జరిగింది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ వేదికగా జరుగుతోన్న ఈ వివాహానికి ఇండస్ట్రీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ వివాహ సంబరాల్లో భాగంగా విజయ్ - రష్మిక 'విరోష్ ప్రీమియర్ లీగ్' పేరుతో సరదాగా ఓ చిన్న క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహించినట్లు ఇన్‌స్టా వేదికగా పంచుకున్నారు. అలాగే బుధవారం హల్దీ వేడుకను నిర్వహించినట్లు విరోష్ జోడీ తెలియజేసింది. ఇక వీరి వివాహ విందును మార్చి 4న హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు.

# ఒక్క హిట్టు పడలేదు

ఎవరు ఏ రంగాన్ని ఎంచుకున్నప్పటికీ, అందులో రాణించాలంటే ప్రతిభ ఉండాలి. టాలెంట్ ఒక్కటి ఉంటే సరిపోతుందా అంటే, కొంచెం అదృష్టం కూడా ఉండాలనుకోండి అనే సమాధానం వస్తుంది. అదృష్టం అనే విషయంలో ఎవరి అభిప్రాయాలు వాళ్లకి ఉంటాయి. కాకపోతే అదృష్టం అనే దాని గురించి అప్పుడప్పుడు నమ్మవలసి వస్తుంటుంది. అందుకు కారణాలు .. కళ్లముందు కనిపించేవే అని చెప్పాల్సి ఉంటుంది. ఆశించినస్థాయిలో గుర్తింపు రానప్పుడు .. విజయాలు అందనప్పుడు .. అదృష్టం లేదని చెప్పుకుంటూ ఉంటారు. అలాంటి అదృష్టాన్ని వెతికి పట్టుకునే పనిలో ఉంటారు. ప్రస్తుతం భాగ్యశ్రీ బోర్సే అదే పనిలో ఉందని అంటున్నారు. ఇప్పుడున్న కథానాయికలలో గ్లామరస్ బ్యూటీ ఎవరంటే కుర్రకారు ఠకీమని చెప్పే మాట భాగ్యశ్రీ బోర్సే. తుమ్మెదల్లాంటి కళ్లతో మనసులు దోచే ఈ సుందరికి ఇంతవరకూ హిట్టు పడలేదు. ఆమె అభిమానులు బెంగపెట్టుకోవడంలోని అసలు కారణం ఇదే. ఈ నేపథ్యంలో ఆమె అఖిల్ సరసన నాయికగా 'లెనిన్' సినిమా చేస్తోంది. మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను, అన్నపూర్ణ - సితార సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'మే'లో ఈ సినిమాను విడుదల చేసే ఆలోచనలో ఉన్నారు. తమన్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. భాగ్యశ్రీ గ్లామర్ ఈ సినిమాకి ప్రత్యేకమైన ఆకర్షణగా నిలుస్తుందని అంటున్నారు. ఈ సినిమాతోనైనా ఆమెకి అదృష్టం కలిసొస్తుందేమో చూడాలి మరి.





# అక్కడ.. ఇక్కడ కియారా సక్సెస్



సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్లుగా సక్సెస్ ట్రాక్ కొనసాగిస్తూ, వ్యక్తిగత జీవితాన్ని కూడా అంతే అందంగా బ్యాలెన్స్ చేసే వారు కొందరే ఉంటారు. ఆ జాబితాలో అగ్రస్థానంలో నిలుస్తుంది అందాల నటి కియారా అద్వానీ. తన నటనతో, గ్లామర్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్న ఈ ముద్దుగుమ్మ, ప్రస్తుతం కెరీర్ పరంగానే కాకుండా పర్సనల్ లైఫ్‌లోనూ ఎంతో సంతోషంగా ఉంది. 1992, జూలై 31న ముంబైలో జన్మించిన కియారా అసలు పేరు అలియా అద్వానీ. తండ్రి జగదీప్ అద్వానీ వ్యాపారవేత్త కాగా, తల్లి జెనీవీవ్ జాఫ్రీ ఉపాధ్యాయురాలు. మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ పూర్తి చేసిన కియారా.. 2014లో 'ఫగ్లీ' చిత్రంతో సినీ అరంగేట్రం చేసింది. ఆ తర్వాత 'ఎం.ఎస్ ధోనీ' బయోపిక్ ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. తెలుగులో మహేశ్ బాబుతో 'భరత్ అనే నేను', రామ్ చరణ్‌తో 'వినయ విధేయ రామ' మరియు త్వరలో విడుదల కానున్న 'గేమ్ ఛేంజర్' సినిమాలతో టాలీవుడ్ ప్రేక్షకులకు కూడా ఎంతో దగ్గరైంది. కియారా తన సహనటుడు, బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాను ప్రేమ వివాహం చేసుకుంది. 'షేర్షా' సినిమా షూటింగ్ సమయంలో వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించింది. కొన్నేళ్ల పాటు డేటింగ్‌లో ఉన్న ఈ జంట గతేడాది రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో అట్టహాసంగా పెళ్లి చేసుకున్నారు. తాజాగా ఈ జంటకు కుమార్తె జన్మించడంతో కియారా జీవితం మరింత పరిపూర్ణమైంది. ప్రస్తుతం ఈ దంపతులు ముంబైలోని బాంద్రాలో గల తమ లగ్జరీ నివాసంలో ఫ్యామిలీ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. ఒకవైపు తల్లిగా బాధ్యతలు నిర్వహిస్తూనే, మరోవైపు సినిమాల్లోనూ బిజీగా ఉంది కియారా. ప్రస్తుతం ఆమె చేతిలో 'డాన్ 3', 'టాక్సిక్' వంటి భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. తన వ్యక్తిగత విషయాలను, ఫోటోలను నిత్యం సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకుంటూ, మోడ్రన్ ఉమెన్‌గా అందరికీ స్ఫూర్తినిస్తోంది.

# ది కేరళ స్టోరీ విడుదలకు బ్రేక్

## సెన్సార్ బోర్డును తప్పుపట్టిన హైకోర్టు

**తిరువనంతపురం, ఫిబ్రవరి 26:** సరిగ్గా విడుదలకు ఒక్కరోజు ముందు 'ది కేరళ స్టోరీ2' మూవీకి న్యాయపరంగా ఎదురుదెబ్బ తగిలింది. సినిమా ప్రచార చిత్రంలో కేరళను తప్పుగా చూపించారని, మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే అంశాలు ఉన్నాయని సామాజిక మాధ్యమాల వేదికగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సినిమా విడుదలపై స్టే విధించాలని, సెన్సార్ సర్టిఫికేషన్ రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై గురువారం రాష్ట్ర హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) తీరును హైకోర్టు తప్పుపట్టింది. సినిమా పునః పరిశీలించాల్సిందిగా జస్టిస్ కురియన్ థామస్ సీబీఎఫ్‌సీకి సూచించారు. అప్పటివరకూ సినిమా విడుదలపై స్టే విధిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. 2023లో వివాదాల నడుమ విడుదలైన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా ఈ సినిమా రూపొందింది. దీనికి కామాఖ్యా నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించగా విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించారు. ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా నటించారు. ప్రేమ మాయలో పడి కొందరు అమ్మాయిలు.. కన్నవాళ్లను ఎదురించి తమ ప్రియుడితోనే జీవితం అనుకుని దూరమవుతుంటారు. కానీ రోజులు గడుస్తున్నకొద్దీ ఆ ప్రేమే ఓ పెద్ద మోసమని తెలుసుకున్నాక దిక్కుతోచని పరిస్థితుల మధ్య ఎవరికీ చెప్పుకోలేని హింసని భరిస్తుంటారు. అలాంటి నిజజీవిత కథాంశంతో 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్' రూపొందింది. ఫిబ్రవరి 27న ఈ మూవీని విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కేరళ హైకోర్టు ఉత్తర్వులతో ప్రస్తుతం వాయిదా పడింది.




Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

TGTEL/25/A1737 | NETI SAKSHI

# డిఫెన్సివ్ డ్రైవింగ్‌తోనే సురక్షిత ప్రయాణం



- ఎస్సై పి.ఉదయ్ కుమార్
- గోడిశెలపేటలో రోడ్డు భద్రతపై పోలీసుల అవగాహన కార్యక్రమం

**నేటి సాక్షి, ఎండపల్లి:** జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు తెలంగాణ పోలీస్ శాఖ చేపట్టిన “అరైవ్ అలైవ్” రోడ్డు భద్రతా క్యాంపెయిన్‌లో భాగంగా ఎండపల్లి మండలం గోడిశెలపేట గ్రామంలో డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్గటూర్ పోలీస్ స్టేషన్ ఎస్సై పి.ఉదయ్ కుమార్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి వాహనదారుడు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ వినియోగించాలి, మద్యం సేవించి వాహనం నడపకూడదని హెచ్చరించారు. అలాగే వేగ పరిమితులను పాటించడం, వాహనం నడుపుతున్న సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం పూర్తిగా నివారించడం అవసరమన్నారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ ద్వారా ఇతర వాహనదారులను గౌరవిస్తూ ముందస్తు జాగ్రత్తలతో సురక్షితంగా ప్రయాణించవచ్చని ఆయన వివరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తేనే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందికట్ల అమృత–రాజేశం, పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు, వాహనదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

# జగిత్యాల టౌన్ పోలీసుల అత్యుత్సాహం.

- ఎమ్మెల్యే కాన్వాయ్‌కు దారివ్వలేదని యువకుడికి వేధింపులు
- ట్రాలీ ఆటో సీజ్ స్టేషన్‌కు తరలింపు





**నేటి సాక్షి, జగిత్యాల బ్యూరో(రాధారపు నర్సయ్య):** జగిత్యాల పట్టణంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాన్వాయ్‌కు దారివ్వలేదన్న కారణంతో ట్రాలీ ఆటో డ్రైవర్‌ను పోలీసులు వేధించారన్న ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. జగిత్యాల సబ్‌స్టేషన్ నుండి సామగ్రితో బయలుదేరిన ట్రాలీ ఆటో, రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఎమ్మెల్యే వాహనానికి సైడ్ ఇవ్వలేకపోయిందని డ్రైవర్ వాదిస్తున్నాడు. అయితే దీనిపై టౌన్ పోలీసులు ట్రాలీ ఆటోను ఆపి స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. ఎమ్మెల్యే కాన్వాయ్‌కు మార్గం కల్పించలేదనే అభియోగంతో పోలీసులు ట్రాలీ ఆటోను సీజ్ చేసి జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్ క్వార్టర్స్‌లో ఉంచిన వ్యానులో తన సామగ్రి ఏదైనా పోతే పోలీస్ స్టేషన్‌పైనే కేసు వేస్తానని బాధితుడు హెచ్చరిస్తున్నాడు. తన వాహనం మరియు అందులో ఉన్న సామగ్రిని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. బాధిత యువకుడు పోస్ట్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో ఈ ఘటన జిల్లాలో చర్చనీయాంశమైంది. చయిఖ్స్త్రఖ్రీ చమీూాయిఖఅయిఖఎ చువశ్రీఖఅస్త్రుఖఋాశీశ్రీఅఎవ వంటి హ్యాష్‌ట్యాగ్‌లతో వీడియో విస్తృతంగా షేర్ అవుతోంది. పోలీసుల చర్యలు అతిగా ఉన్నాయా.? లేక విధి నిర్వహణలో భాగమా.? అన్న దానిపై నెటిజన్ల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై అధికారుల స్పందన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపిన నాలుగో తరగతి ఉద్యోగ సంఘం



**నేటి సాక్షి, జగిత్యాల, ( గుండ ప్రశాంత్ గౌడ్ ):** రాష్ట్ర ముఖ్యమంత్రి కి మంత్రివర్గంలో ఉద్యోగులకు హెల్త్ స్కీమ్ గురించి నిర్ణయం తీసుకొని ఉద్యోగులకు న్యాయం చేసినటువంటి రాష్ట్ర ముఖ్యమంత్రి కి మంత్రివర్గానికి తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల జగిత్యాల జిల్లా సంఘం తరఫునుంచి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రభుత్వ పథకాలు ఏ కార్యక్రమం చేపట్టిన దానికి మా వంతుగా అన్ని కార్యక్రమంలో నాలుగో తరగతి ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయడానికి కోసం కృషి చేస్తామని చెప్పి పైన తెలిపిన కార్యవర్గం తెలపడం జరిగినది. అంతేకాదు రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రివర్గం అన్ని విధాల ఉద్యోగులకు అందిస్తున్నటువంటి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఈ కార్యక్రమం లో జగిత్యాల జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా సంఘం అధ్యక్షులు బి.చంద్రయ్య, కార్యదర్శి వేణు, ముజహిద్ ఖాన్, ఉపాధ్యక్షులు వీరయ్య, పట్టణ అధ్యక్షుడు, పట్టణ కార్యదర్శ, జిల్లా కోశాధికారి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి సన్నిధిలో తంగడపల్లి సుధీర్ రెడ్డి కుటుంబం

- సమాజ అభివృద్ధికి దైవ ఆశీస్సులు కోరుతూ ప్రత్యేక పూజలు..
- కుటుంబ సమేతంగా శ్రీవారి దర్శనం, ప్రత్యేక పూజల నిర్వహణ..

**నేటి సాక్షి, శంకర్‌పల్లి:** రంగారెడ్డి జిల్లా, చేవెళ్ల మండలం తంగడపల్లి గ్రామానికి చెందిన, గొల్లగూడెం సుధీర్ రెడ్డి కుటుంబ సమేతంగా తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని భక్తి పరవశంలో మునిగిపోయారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఆలయ ఆచార వ్యవహారాల ప్రకారం తీర్థ ప్రసాదాలు స్వీకరించి, క్షేమకాంక్షలతో భగవంతుని ప్రార్థించారు. ఈ సందర్భంగా తంగడపల్లి గ్రామానికి చెందిన గొల్లగూడెం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని, ప్రతి ఇంటా శ్రేయోభివృద్ధి నెలవాలని స్వామివారిని వేడుకున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని, దైవ ఆశీస్సులు మరియు ప్రజల మద్దతు ఉంటే సమాజ అభివృద్ధి మరింత వేగంగా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, శాంతి నెలకొనాలని మనసారా కోరుకుంటున్నామని అన్నారు. తిరుమల యాత్రలో భాగంగా ఆలయ పరిసరాల్లోని పుణ్యక్షేత్రాలను దర్శించుకున్న తంగడపల్లి గొల్లగూడెం సుధీర్ రెడ్డి కుటుంబ సభ్యులు, ఆధ్యాత్మిక వాతావరణంలో కొంత సమయం గడిపారు. భక్తులతో కలిసి గోవింద నామస్మరణలో పాల్గొని, స్వామివారి అనుగ్రహం పొందారు. ఈ కార్యక్రమంలో గొల్లగూడెం బాగిరెడ్డి, భరతమ్మ, సుధీర్, సాత్విక, విహన్యా రెడ్డి, విహాన్షికా రెడ్డి గ్రామ చిన్నలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు.



**నేటి సాక్షి వికారాబాద్ :** చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు సందర్భంగా వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండల కేంద్రంలో కేక్ కట్ చేసి, బాణా సంచా కలుస్తూ బిజెపి మండల పార్టీ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది. తదనంతరం మొయినాబాద్ లోని అంజనీ దేవి ఫంక్షన్ హాల్లో చేవెళ్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కే.ఎస్ రత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది, తగనంతరం ప్రతి సంవత్సరానుసారంగా తన జన్మదిన సందర్భంగా ప్రతి గ్రామంలో ఒక పేద విద్యార్థికి పంపిణీ చేసే ఆర్థిక సహాయ చెక్కులను విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చంద్రకాంత్, కమిటీ సభ్యులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డ్ మెంబర్లు, సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ గాకడియాల వేణుగోపాల్

**మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్.**



**నేటి సాక్షి వికారాబాద్ :** వికారాబాద్ పట్టణం లోని తన నివాసంలో కౌన్సిలర్లు పట్టణ టిఆర్ఎస్ పార్టీ నాయకుల తో సమావేశమైన వికారాబాద్ జిల్లా బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సమావేశంలో భాగంగా కౌన్సిలర్లు పట్టణ టిఆర్ఎస్ పార్టీ నాయకులందరి అభిప్రాయం మేరకు వికారాబాద్ మున్సిపాలిటీ బీ ఆర్ ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ గా కడియాల వేణుగోపాల్ గారిని ఏకగ్రీవంగా నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గోపాల్ ముదిరాజ్ కౌన్సిలర్ చంద్రశేఖర్ రెడ్డి కౌన్సిలర్ మమతా అంజి వేణు మంచన్పల్లి సురేష్ జ్యోతి ధరూర్ మాజీ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, సుభాన్ రెడ్డి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలకు వేళాయే

**సర్వాంగ సుందరంగా ముస్తాబైన దేవాలయం**




**నేటి సాక్షి, ఎండపల్లి:** మండల పరిధి గుల్లకోట గ్రామంలోని పురాతన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఈ నెల 28వ తేదీ నుండి మార్చి 5వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆహ్వాన పత్రిక ద్వారా వెల్లడించారు. ఉత్సవాల నేపథ్యంలో ఆలయానికి రంగులు వేసి, విద్యుద్దీపాలతో అలంకరించి, ప్రాంగణాన్ని శుభ్రపరచి ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దారు. ఆలయం ప్రకాశవంతంగా మెరిసిపోతూ భక్తులను ఆహ్వానిస్తోంది. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు దేవస్థాన ప్రధాన అర్చకులు అరుట్ల రంగాచార్యులు తెలిపారు. కాగా ఈ నెల 28న స్వామివారి తిరుకళ్యాణం, మార్చి 1న దీపోత్సవం, 4న రథోత్సవం ఘనంగా జరుగనున్నాయి. అదే రోజున ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం, భక్తులకు సాన భాగ్యలక్ష్మి–యాది రెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టనున్నారు. చివరి రోజు 5న చక్రతీర్థం, అవభృతస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, ప్రసాదం, పార్కింగ్ వంటి అన్ని సదుపాయాలు కల్పించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ బిసగోని సత్యం గౌడ్ తెలిపారు. ఉత్సవాల విజయవంతానికి గ్రామ ప్రజలు, యువకులు సహకరించాలని గ్రామ పంచాయితీ సర్పంచ్, ఉప సర్పంచ్, పాలకవర్గం, ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా గుల్లకోట గ్రామం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడనుంది.

## ఉద్యోగులకు ఆరోగ్య భీమా

### నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు అరుణ



**నేటి సాక్షి , జగిత్యాల టౌన్, (పూరెళ్ల బాపు ):** ఉద్యోగులకు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరోగ్య భీమా పథకాల పట్ల ఉద్యోగులు హర్షం ప్రకటించారని నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షురాలు క్యారంగుల అరుణ తెలిపారు. గురువారం నాల్గవ తరగతి ఉద్యోగుల జిల్లా కార్యవర్గ సమావేశం సంఘం కార్యాలయంలో అరుణ అధ్యక్షతన జరుగగా పలు తీర్మాణాలు చేశారు. భవిష్యత్తు కార్యాచరణ, సంఘం పటిష్టత, సభ్యుల ఐక్యత, ఉద్యోగుల ప్రయోజనం కోసం ప్రభుత్వం ప్రకటించిన స్కీముల పట్ల సీఎం రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలుతెలుపుతూ సమావేశం తీర్మానం చేసిందని అరుణ తెలిపారు. సమావేశంలో కార్యదర్శి నారాయణ, కోశాధికారి సతీష్, భాగ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## మహోన్నత చరిత్ర కలిగిన ప్రాంతం ”గాంధారి ఖిల్లా

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నేటి సాక్షి మంచిర్యాల జిల్లా:** జిల్లాలోని మందమర్రి మండలంలోని గాంధారి ఖిల్లాకు మహోన్నత చరిత్ర ఉందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్ లో నాయకపోడ్ సేవా సంఘం ప్రతినిధి పల్ల సత్యనారాయణ, పుస్తక రచయిత మేసినేని రాజన్న, నాయకపోడ్ హక్కుల పరిరక్షణ కమిటీ ప్రతినిధి గంజి రాజన్న, జిల్లా ప్రతినిధులు పెద్ది రాజన్న, గాంధారి మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధి దైనేని రమేష్ లతో కలిసి గాంధారి ఖిల్లా చరిత్ర భాగం-1 పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పూర్వకాలం ఈ ప్రాంతంలో పాండవులు పర్యటించినట్లు చరిత్ర ఉందని, గిరిజనులు పాండవులను ఆరాధ్య దైవాలుగా కొలుస్తారని తెలిపారు. తెలంగాణలో వనదేవతలను కొలిచే ఆచారం ప్రసిద్ధి పొందిందని, ఈ క్రమంలో గాంధారిఖిల్లా మైసమ్మను దేవతగా కొలుస్తారని తెలిపారు. మహోన్నత చరిత్ర కలిగిన గాంధారి ఖిల్లా ప్రాంత వైభవాన్ని, చరిత్రను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో పుస్తక రచన చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు

## గాయత్రి బ్యాంక్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** పట్టణంలోని సాగర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన గాయత్రి కో-అపరేటివ్ అర్బన్ బ్యాంకును స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు స్కైలాబ్ నాయక్, బ్యాంక్ అధికారులతోకలసి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చక్రపాని, అవట శ్రీను, కాంగ్రెస్ నాయకులు పాతూరి ప్రసాద్, నాగలక్ష్మి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పుంగనూరు న్యాయస్థానం ఏజీపీగా చౌడేపల్లి సురేష్



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి:** పుంగనూరు న్యాయస్థానంలో ఏజీపీగా చౌడేపల్లి కి చెందిన బూరగల సురేష్ బాబు నియమితులయ్యారు. మండల కేంద్రమైన చౌడేపల్లికి చెందిన ఆయన పుంగనూరు న్యాయస్థానంలో సీనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఆయనను అన్నమయ్య జిల్లా పుంగనూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ,) గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయవాది సురేష్ బాబు, మూడు సంవత్సరాలు పాటు ఏజీపీగా కొనసాగుతారని ఉత్తర్వులు జారీ చేశారు ఏజీపీగా బాధ్యతలు చేపట్టనున్న ఆయనను స్థానికులు అభినందించారు

# బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేయాలి





- ధర్మపురి బ్రహ్మోత్సవాలపై జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సమీక్ష



**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో,( రాధారపు నర్సయ్య ):** జగిత్యాల జిల్లాలో కురిసిన అకాల వర్షాలతో పలు మండలాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రాయికల్ మండలం రామోజీపేట గ్రామంతో పాటు జగిత్యాల రూరల్ మండలం చల్గల్ గ్రామంలో నష్టపోయిన పంటలను జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ రైతులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. రాయికల్ మండలం రామోజీపేట గ్రామంలో మొక్కజొన్న పంటలు నేలకూలగా, మామిడి తోటల్లో పండ్లు రాలిపోయి రైతులకు భారీ నష్టం వాటిల్లింది. అలాగే చల్గల్ గ్రామానికి చెందిన రైతులు రాజేందర్, వెంకటస్వామి గార్ల మొక్కజొన్న పంటలు కూడా వర్షాల కారణంగా దెబ్బతిన్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయానికే అకాల వర్షాలు నష్టం కలిగించాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దావ వసంత సురేష్ మాట్లాడుతూ, నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం అందజేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం, ఎరువులు, 24 గంటల కరెంటు సకాలంలో అందించడంలో విఫలమైందని విమర్శించారు. “కాంగ్రెస్ ప్రభుత్వం తో పాటు ప్రకృతి కూడా రైతులపై కన్నెర్ర చేసింది” అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయాన్ని పండుగలా మార్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ గారికే దక్కుతుందని ఆమె పేర్కొన్నారు. రైతుబంధు, ఉచిత విద్యుత్ వంటి పథకాలతో రైతులకు భరోసా కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల అధ్యక్షులు బర్కాం మల్లేష్, ఆనందరావు, కోఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రత్నాకర్ రావు, మాజీ సర్పంచ్ ఎల్ల రాజన్న, గ్రామ శాఖ అధ్యక్షుడు పూదరి శ్రీను, వార్డు మెంబర్ బొల్లారం ముత్యం, బాలే చందు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉదయశ్రీ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోట గంగరాజం, మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వర్ రావు, యూత్ అధ్యక్షుడు బదుగు గోపాల్, కుంట వెంకన్న, చింతలపల్లి దేవన్న, దాసరి నరసయ్య, అల్లం నాగస్వామి, ఓగులపు రాజేందర్, చిన్న కోల నరేష్, బీఆర్ఎస్ నాయకులు రామపతి రావు, రాజేందర్ గౌడ్, ప్రశాంత్ రావు, సత్యం గౌడ్, గంగారం లక్ష్మణ్, కన్నాక మహేందర్, గడ్డం మల్లారెడ్డి, నరేష్ తదితరులు, రైతులు పాల్గొన్నారు.

# చక చక్యంగా ప్రదర్శించిన కాగజ్ నగర్ పోలీసుల బృందం



**నేటి సాక్షి కాగజ్నగర్ టౌన్ :** పోలీస్ వరుసగా జరిగిన దొంగతనం కేసులను విజయవంతంగా ఛేదించి నలుగురు నిందితులను అరెస్ట్ చేయడమైనది. పోలీసుల పనితీరుపై కాగజ్నగర్ పట్టణ ప్రజలు.హర్షం వ్యక్తం చేస్తున్నారు కాగజ్నగర్ పోలీసులు కు జిల్లా ఎస్పీ అభినందించినారు పట్టణంలో మొన్న జరిగినటువంటి మున్సిపాలిటీ ఎన్నికలలో చాలా చక్కగా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించినారు వరుస దొంగతనాలు ప్రత్యేకంగా నిఘా పెట్టి దొంగలను పట్టుకోవడంలో సఫలం కావడం అభినందనీయం 05-01-2026 తేదీన సుమారు మధ్యాహ్నం 04:00 గంటలకు దండే మంగా, భర్త లేట్ ప్రసాద్, వయస్సు 52 సంవత్సరాలు, ూచీవీ (ఈగావన్ూాంజ), నివాసం: సిర్పిల్క్ కాలనీ, కాగజ్నగర్ టౌన్, ఫిర్యాదు చేయగా, ఆమె 03-01-2026 తేదీన తన ఇంటికి తాళం వేసి హైదరాబాద్కు వెళ్లిన సమయంలో, గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో ఇంటి తలుపుల తాళాలు పగులగొట్టి 7 హ్ తులాల బంగారు ఆభరణాలు మరియు 1 కిలో వెండి వస్తువులు, సుమారు రూ.2,75,000/-విలువైన ఆస్తిని అపహరించినట్లు తెలిపినది. BNS చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడమైనది. .07/2026 USec 331(4), 305(a) దర్యాప్తు సందర్భంగా 26-02-2026 తేదీన మధ్యాహ్నం 12:00 గంటలకు విశ్వసనీయ సమాచారంపై కొందరు వ్యక్తులపై అనుమానం రావడంతో కాగజ్ నగర్ పట్టణంలో A1 - ఇర్షాద్ పాషా ఏ తాజ్, వృత్తి: జీజదీ డ్రైవర్, నివాసం: సుభాష్ చంద్రబోస్ కాలనీ, కాగజ్నగర్ టౌన్. అదుపులోకి తీసుకొని విచారించగా, తన సహచరులతో కలిసి ఈ నేరాన్ని చేసినట్లు ఒప్పుకున్నాడు.

**అతని సహచరులు:**

A2 - షైక్ అంజద్, వృత్తి: సెంటరింగ్ వర్కర్, నివాసం: సిర్పిల్క్ కాలనీ, కాగజ్నగర్ టౌన్. A3 - మిర్జా సోహైల్ బేగ్, వృత్తి: జీజదీ డ్రైవర్, నివాసం: చింతగూడ గ్రామం, కాగజ్నగర్. విచారణలో నిందితులు కలిసి ఒక గుంపుగా ఏర్పడి, సిర్పిల్క్ కాలనీ మరియు కాగజ్నగర్ టౌన్ పరిసర ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని గృహ భేధన, దొంగతనాలు చేస్తూ సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గత కొన్నేళ్లుగా నేరాలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారు. ప్రస్తుత కేసుతో పాటు కాగజ్నగర్ టౌన్ పోలీస్ స్టేషన్లో నమోదైన మరో ఆరు ఆస్తి నేరాలలో కూడా తమ ప్రమేయం ఉన్నట్లు అంగీకరించారు. నిందితులు అపహరించిన బంగారం, వెండి ఆభరణాలను రిసీవర్లకు విక్రయించినట్లు వెల్లడించగా, A4 - చిలుకూరి శ్రీకాంత్, వృత్తి: గోల్డ్‌స్మత్, నివాసం: బాలాజీ నగర్, కాగజ్నగర్ను అదుపులోకి తీసుకొని విచారించగా, అపహరించిన ఆభరణాలను స్వీకరించి లాభం కోసం ఇతరులకు బదిలీ చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితులు A1 నుండి A4 వరకు అరెస్ట్ చేసి గౌరవ న్యాయస్థానంలో హాజరు పరచడమైనది. అపహరించిన ఆస్తిని చట్టబద్ధమైన పంచనామా ద్వారా స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన నిందితులు కాగజ్నగర్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో క్రింది కేసుల్లో కూడా ప్రమేయం

**కలిగియున్నారు:**

1. CrNo07/2026 USec 331(4), 305(a) బన్స్..
2. CrNo. 228/2023 USec 457, 380 IPC
3. CrNo. 45/2025 USec 331(4), 305(a) BNS
4. CrNo. 58/2025 USec 331(4), 305(a) BNS
5. CrNo. 302/2025 USec 331(4), 305(a) BNS
6. CrNo. 351/2025 USec331(4), 305(a) BNS
7. CrNo..352/2025 USec 331(4), 305(a) BNS

ప్రజలు తమ ఇళ్లలో బలమైన తాళాలు అమర్చుకోవడం, జజుఎ కెమెరాలు ఏర్పాటు చేయడం మరియు అనుమానాస్పద వ్యక్తుల కదలికలు గమనించిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించడమైనది. ఈ నిదుతులను పట్టుకోవడంలో ప్రతి ఒక్క చొరవ చూపిన కాగజ్ నగర్ పట్టణ టౌన్ సిఐ ప్రేమ్ కుమార్ ఎస్సై సుధాకర్ కానిస్టేబుల్ నాగరాజు రషీద్ రాజు సత్యనారాయణ పాల్గొన్నారు

# చిలుకూరులో రోడ్డు ప్రమాదం

### కారు-బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

### క్షతగాత్రుల పరిస్థితి విషమం.. కోదాడ ఆస్పత్రికి తరలింపు

**నేటి సాక్షి , చిలుకూరు:** చిలుకూరు మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ వద్ద గల వాటర్ ప్లాంట్ సమీపంలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా వచ్చిన కారు, బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో బైక్ మీద ప్రయాణిస్తున్న మొక్క శ్రీనివాస్, బండ్ల నాగరాజు అనే ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో బైక్ పూర్తిగా ధ్వంసం కాగా, బాధితులకు రక్తస్రావం కావడంతో వారి పరిస్థితి విషమంగా ఉంది. వెంటనే స్పందించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను అత్యవసర చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



### మంజుల..ఓ మమతల కోవెల



'మంజుల' మనసు..
మమతల తోట.!
పదవి కాదు ఆమెకు గౌరవం.
ప్రజల ప్రేమే ఆమెకు ఆభరణం.!
రైతు కష్టంలో తోడు నిలిచి..
గ్రామ గుండెలో దీపం వెలిగించి.!
మాటల్లో ధైర్యం..
చర్యల్లో సేవా స్ఫూర్తి.
అమ్మగా ఆదరణ
నాయకురాలిగా మార్గదర్శనం
అందుకే మంజుల పేరు
ప్రజల గుండెల్లో చిరస్థాయి.!
నాయకత్వం ఆమె శ్వాస..
అడుగులు వేస్తే అభివృద్ధి దారి..
చూపులు సారిస్తే ఆశల జ్యోతి.
అన్యాయం ఎదురైతే
ఆమె స్వరం గర్జన.!
బలహీనుల బలంగా..
రైతుల ఆశాదీపంగా,
మహిళల గౌరవంగా
నిలిచే శక్తి – మంజుల.!
మహిళా శక్తి రూపం
ప్రజల కోసం పుట్టిన పాదం
సమాజాన్ని మలిచే శక్తి మంజుల.!
రచన : మంజుల పత్తిపాటి
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డెరెక్టర్
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం. చరవాణి 9347042218.

## రాయికల్‌లో ఘోర ప్రమాదం.!

### స్కూల్ బస్సు ఢీకొని బైక్‌పై ఉన్న వ్యక్తి మృతి




**నేటి సాక్షి,రాయికల్,(రాధారపు నర్సయ్య ):** రాయికల్ మండలంలోని రామజీపేట వద్ద గురువారం విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ద్విచక్ర వాహనాన్ని పాఠశాల బస్సు ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సు ప్రమాదంలో మృతిచెందిన అతన్ని గుండంపల్లి గ్రామానికి చెందిన పుల్లూరి మధుగా గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు స్కూల్ బస్సు మరియు ద్విచక్ర వాహనం ఎదురెదురుగా వచ్చిన సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఢీకొట్టిన ప్రభావంతో మధు తీవ్ర గాయాలపాలై సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది.ఈ ఘటనతో గుండంపల్లి గ్రామంలో విషాదం నెలకొంది.

## రాజనాల బండకు 'దేవరెద్దు'

### శాస్త్రోక్తంగా భక్తుల సంబరాలు



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి:** సత్య ప్రమాణాలకు పెట్టింది పేరైన పుణ్యక్షేత్రం రాజనాల బండ వద్ద గురువారం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య 'దేవరెద్దు'ను పట్టుకున్నారు. రాజనాల బండపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలకు సంబంధించి మూడు దేవరెద్దులు ఉండేవి. అయితే ఇటీవల అందులో ఒక ఎద్దు మరణించడంతో, ఆ స్థానంలో కొత్త దేవరెద్దును ఎంపిక చేసే ప్రక్రియను గ్రామస్థులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దిగువపల్లి పంచాయతీ పరిధిలోని చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న నాటు ఆవులన్నింటినీ కాపునీకుంట వద్దకు చేరవేశారు. శాస్త్ర సూక్తం ప్రకారం, ఆవు మరియు దూడ ఒకే చోట ఆహారాన్ని భుజించడంతో, దానిని దైవ నిర్ణయంగా భావించి ఆ దూడను దేవరెద్దుగా పరిగణించారు. మోట్లపల్లికి చెందిన రెడ్డి వారి కృష్ణప్ప ఆవు దూడను దేవుడే నిర్ణయించాడని భక్తులు విశ్వసిస్తూ, మంగళవాయిద్యాలు మరియు సాంస్కృతిక కార్యక్రమాల మధ్య రాజనాల బండకు తీసుకువచ్చారు. కొత్త దేవరెద్దును ఆలయానికి తీసుకువచ్చిన సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుండే కాకుండా, ఇతర ప్రాంతాల నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రాజనాల బండ ప్రాంతం భక్తుల కోలాహలంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

# కోరుట్ల పశువైద్య కళాశాలలో మాంస ఉత్పత్తులపై శిక్షణ

- **ఎస్సీ లబ్ధిదారులకు విలువ జోడింపు ఉత్పత్తులపై అవగాహన**




**నేటి సాక్షి - కోరుట్ల,( రాధారపు నర్సయ్య):** పి.వి. నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న కోరుట్ల పశువైద్య కళాశాలలో పశు ఉత్పత్తుల సాంకేతిక విభాగం ఆధ్వర్యంలో గురువారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో 25 మంది ఎస్సీ లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ డాక్టర్ దాసరి శ్రీనివాస్ మాంస ఉత్పత్తి మరియు మాంస ప్రాసెసింగ్ ప్రాముఖ్యతపై విపులంగా వివరించారు. పోషక విలువలు అధికంగా ఉన్న ఆహారాల వైపు ప్రజలు మళ్లాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. మాంస ఉత్పత్తుల్లో విలువ జోడింపు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని వివరించారు. శిక్షణలో భాగంగా చిన్న స్థాయి వ్యవసాయంలో కుందేలు పెంపకం (రాబిట్రీ), పంది పెంపకం (పిగ్గరీ), గొర్రెలు, మేకల పెంపకం, కోళ్ల పెంపకం మరియు క్వైల్ పెంపకం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. స్వయం ఉపాధి అవకాశాలపై నిపుణులు మార్గదర్శకత్వం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఈ. కుమార్, డాక్టర్ సుష్మ, డాక్టర్ అనిత, డాక్టర్ శిరీష, డాక్టర్ భవ్య, డాక్టర్ రాజు, డాక్టర్ అర్చన, డాక్టర్ ప్రజ్ఞ, డాక్టర్ ఆలియా తహసీన్ పాల్గొన్నారు. ఈ శిక్షణకు అవసరమైన నిధులను హైదరాబాద్ జాతీయ మాంస పరిశోధన సంస్థ డైరెక్టర్ అందించారు. నిధులు సమకూర్చడంలో సహకరించిన ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా. పి. బస్వా రెడ్డి, డాక్టర్ యోగేష్ గడేకర్‌లకు నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.పాల్గొన్న లబ్ధిదారులకు సర్టిఫికెట్లు మరియు శిక్షణ పుస్తకాలను అందజేసి, రైతుల అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# రాష్ట్ర స్థాయి యోగ పోటీలలో వెండి పతకం

### గురుకుల విద్యార్థిని అభినందించిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్




**నేటి సాక్షి - కోరుట్ల,( రాధారపు నర్సయ్య ):** రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన సీఎం కప్–2 ఎడిషన్ యోగ పోటీలలో వెండి పతకం సాధించిన గురుకుల పాఠశాల విద్యార్థిని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అభినందించారు. కోరుట్ల పట్టణంలోని కల్లూరు రోడ్డులో ఉన్న గురుకుల పాఠశాలకు చెందిన మిక్విన్ అనే విద్యార్థిని ఈ నెల 21 నుంచి 23 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి యోగ పోటీలలో ద్వితీయ బహుమతి సాధించి వెండి పతకం అందుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ రోజుల్లో ఆరోగ్యంగా ఉండాలంటే యోగ ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రతిభ కనబరచాలని సూచించారు. క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని, విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుకు రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు శారీరక విద్యా ఉపాధ్యాయుడు అజయ్, పాఠశాల ప్రిన్సిపాల్ బండి బాబు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థిని సాధించిన విజయంపై పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

# డిజిటల్ హెల్త్ కార్డు ల పై అపోహలు వద్దు


- **ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు పింగళి శ్రీపాల్ రెడ్డి**



**నేటి సాక్షి - జగిత్యాల, (పూరెళ్ల బాపు ):** ప్రభుత్వం జారీ చేయబోయే డిజిటల్ హెల్త్ కార్డులపై అపోహలు వద్దని ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు శ్రీపాల్ రెడ్డి అన్నారు.ఈ రోజు ఓల్డ్ హైస్కూల్లో పని చేస్తూ ఈనెల లో ఉద్యోగ విరమణ పొందుతున్న రాళ్ల బండి సావిత్రి మోహన్ రెడ్డిస్కూల్ అసిస్టెంట్ (సోషల్) గారి సన్మాన మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడుతూ హెల్త్ కార్డుల నిర్వహణ ప్రత్యేక ట్రస్ట్ ద్వారా నిర్వహణ ఉంటుందని వారన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు మరియు పెన్షనర్స్ కు వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులందరికీ ఈ స్కీము అన్లిమిటెడ్ గా వర్తిస్తుందని వారన్నారు. అదేవిధంగా సర్వీసు రూల్స్ కు త్వరలోనే పరిష్కారం లభించి పదోన్నతులు వస్తాయని వారన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం శాసనమండలిలో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి మాట్లాడుతూ, పిఆర్సి సాధన కోసం త్వరలోనే ఉద్యమిస్తామని అన్నారు. పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్ మాట్లాడుతూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ప్రభుత్వంపై పోరాడుతామని వారన్నారు. జిల్లా విద్యాధికారి రాము మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనేది ఉద్యోగానికి మాత్రమే, సేవకు కాదు అని ఉద్యోగ విరమణ అనంతరం సేవ చేయాలని వారు అన్నారు అనంతరం సావిత్రి సేవలను కొనియాడారు సావిత్రి ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రకళ పిఆర్టియు టిఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయినిపెల్లి ఆనంద్‌రావు, యాల్ల అమర్నాథ్ రెడ్డి, పీఆర్‌టియు మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరహరి లక్ష్మారెడ్డి, అమ్మ అదర్శ పాఠశాల చైర్మన్ సుజాత, జిటిఎ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# 8 కెనాల్ కాలువలో పిచ్చి మొక్కలు తొలగింపు





**నేటి సాక్షి, గన్నేరువరం , (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండలంలోని మాదాపూర్ గ్రామంలో ఐ8 కెనాల్ కాలువలోని పిచ్చి మొక్కలు తిరిగిపోవడంతో కాలువ గుండా నీరు సరిగా రాలేకపోవడంతో రైతులు గ్రామ సర్పంచి దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించిన గ్రామ సర్పంచ్ మాధురి శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకొని జెసిబి ద్వారా పిచ్చి మొక్కలను తొలగించారు. వెంటనే చెరువులోకి సాగునీరు రావడంతో గ్రామ రైతులు ప్రజలు గ్రామ సర్పంచ్ మాధురి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రైతులు బండి హనుమయ్య, ఆసరా నరసయ్య, గొడుగు స్వామి యాదవ్, గొడుగు రాజు యాదవ్, మాడుగుల స్వామి రెడ్డి, నేదునూరు రాజు, ఆసరి సంతు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

